శనివారం
14-09-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 84
పేజీలు : 6+8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
విశాలాంధ్ర
స్థాపితం : 1952
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

పోర్ట్ బ్లెయిర్ ఇకపై శ్రీ విజయపురం

న్యూఢిల్లీ: అండమాన్ నికోబార్ దీవుల రాజధాని పోర్ట్ బ్లెయిర్ ఇక 'శ్రీ విజయపురం' అయింది. పోర్ట్ బ్లెయిర్ పేరు మారుస్తూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. వలసవాద గుర్తుల నుంచి దేశానికి విముక్తి కల్పించేందుకే ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. శ్రీ విజయపురం... స్వాతంత్ర్య పోరులో విజయానికి ప్రతీకగా తెలిపింది. నాటి పోరాటంలో అండమాన్ నికోబార్ దీవుల పాత్ర ప్రత్యేకమంటూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా 'ఎక్స్'లో పేర్కొన్నారు. చోళ సామ్రాజ్యంలో నౌకదళ స్థావరంగా ఉన్న ఈ భూభాగం.. ప్రస్తుతం దేశ వ్యూహాత్మక, అభివృద్ధి ఆశయాలకు కీలక కేంద్రంగా ఉందన్నారు.

కేంద్ర సాయమేది?

ఘోర విపత్తుకీ కానరాని స్పందన

- రెండు వారాలవుతున్నా పాలకులు మీనమేషాలు
- ఆపన్నహస్తం కోసం బాధితుల ఎదురుచూపు
- ప్రాథమిక నష్టం అంచనా రూ.6,880 కోట్లు
- బుడమేరు, కృష్ణా వరదల తర్వాత ఉత్తరాంధ్ర, ఏలేరు విలయం
- వరుస నష్టాలు, కష్టాలతో ప్రజలు అతలాకుతలం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వందేళ్ల చరిత్రలో ఎన్నడూలేని ఘోర విపత్తు సంభవించినా కేంద్ర ప్రభుత్వం ఇంతవరకు ఎటువంటి ఆర్థిక సహాయం ప్రకటించకపోగా... కనీస స్పందన కనబర్చకపోవడంపై రాష్ట్ర ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి విపత్తు సమయాల్లో తక్షణ సహాయం ప్రకటించే అవకాశం ఉన్నప్పటికీ... ప్రాథమిక నష్టం అంచనా నివేదిక పంపిన తర్వాత కూడా కేంద్ర పాలకులు మీనమేషాలు లెక్కిస్తుండడం పట్ల తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విపత్తు సంభవించి రెండు వారాలవుతున్నా ఇంతవరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎటువంటి ఆర్థిక సహాయం అందకపోవడంతో బాధితులు ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. శతాబ్ద కాలంలో ఎన్నడూ లేని విధంగా ఈనెల 1,2 తేదీల్లో కృష్ణా నదికి, బుడమేరుకు వచ్చిన భారీ వరద రాష్ట్ర రాజధాని విజయవాడ ప్రాంతాన్ని అతలాకుతలం చేసింది. గత నెల 31వ తేదీ ఆకాశానికి చిల్లుపడిందన్నట్లుగా కేవలం 24 గంటల వ్యవధిలో దాదాపు 40 సెంటీమీటర్ల కుంభవర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు ఏకమయ్యాయి. బుడమేరు ఊహించనిస్థాయిలో పొంగి ప్రవహించింది. సుమారు 40 వేల క్యూసెక్కుల వరద విజయవాడ నగరంపై అకస్మాత్తుగా వచ్చి పడింది. మరోపక్క ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలు, తెలంగాణలోని ఖమ్మం, నల్గొండ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో కృష్ణానదికి భారీ వరద వచ్చి చేరింది. వందేళ్ల రికార్డును తిరగరాస్తూ 11 లక్షల 43 వేల క్యూసెక్కుల నీరు ప్రకాశం బ్యారేజీ నుంచి విడుదలయ్యే పరిస్థితి నెలకొంది. ఈ బ్యారేజీ సామర్థ్యం 11 లక్షల 85 వేల క్యూసెక్కులు కావడం గమనార్హం. బుడమేరు ఉగ్రరూపానికి విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలో దాదాపు 32 డివిజన్లు పూర్తిగా నీట మునిగాయి. 46 మంది మృత్యువాతపడ్డారు. ఒక్క ఎన్టీఆర్ జిల్లా పరిధిలోనే 2.82 లక్షల కుటుంబాలకు చెందిన ఏడు లక్షల మంది ప్రజలు వరద ప్రభావానికి గురయ్యారు. ఆరు అడుగుల నుంచి 10 అడుగుల మేర ఇళ్లు నీటమునగడంతో కట్టుబట్టలతో బాధితులు నిరాశ్రయులయ్యారు. దాదాపు వారం రోజులు పూర్తిస్థాయిలో ప్రజలు వరదల్లోనే దుర్భర జీవితం గడిపారు. రాష్ట్ర ప్రభుత్వం హెలికాప్టర్లు, బోట్లు, డ్రోన్ల ద్వారా ఆహారం అందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోపక్క 5 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు పూర్తిగా నీటమునిగి నాశనమయ్యాయి. 111 చోట్ల చెరువులకు గండ్లు పడ్డాయి. భారీ వర్షాల కారణంగా 3,869 కిలోమీటర్ల ఆర్అండ్‌బీ రోడ్లు ధ్వంసమయ్యాయి. 353 కిలోమీటర్ల పంచాయతీ రోడ్లు దెబ్బతిన్నాయి. దాదాపు 80 ప్రాంతాల్లో రోడ్లకు గండ్లు పడ్డాయి. ఒక్క విజయవాడ నగరంలో 560 కిలోమీటర్ల రోడ్లు నాశనమయ్యాయి. రెండు వందల కిలోమీటర్ల తాగునీటి పైపులైన్లు దెబ్బతిన్నాయి. ఇక ఇళ్లల్లో అయితే అంచనాలకందనంత నష్టం వాటిల్లింది. అకస్మాత్తు వరదతో కట్టుబట్టలతో జనం

- మిగతా 2 లో

18న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

నూతన మద్యం పాలసీతో పాటు బుడమేరు ఆపరేషన్‌పై నిర్ణయం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఈనెల 18వ తేదీన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయం ఒకటవ బ్లాక్‌లో జరగనున్న ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. వరద నష్టం, బుడమేరు పటిష్టత, ఆపరేషన్ బుడమేరు, సీఆర్డీఏ పరిధిలో నిర్మాణాలు, కొత్త మద్యం పాలసీ వంటి అంశాలపై మంత్రివర్గం నిర్ణయాలు తీసుకునే అవకాశముందని భావిస్తున్నారు. ముఖ్యంగా బుడమేరు ముంపు కారణంగా తీవ్రంగా నష్టపోయిన బాధితులను ఏ విధంగా ఆదుకోవాలి? ఎంత నష్టపరిహారం చెల్లించాలనే దానిపై నిర్ణయం తీసుకోనున్నారు. ప్రస్తుతం ఎన్యూమరేషన్ బృందాలు వివరాలు సేకరిస్తున్నాయి. ఈనెల 17వ తేదీలోపు పూర్తి చేయాలనే లక్ష్యంగా అధికారులు వేగవంతంగా నిర్వహిస్తున్నారు. ఈలోగా కేంద్ర ప్రభుత్వం కూడా ఆర్థిక సహాయం ప్రకటిస్తుందనే ఆశతో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. దానినిబట్టి నష్టపరిహారంపై నిర్ణయం తీసుకోనున్నారు. విజయవాడ నగరం మరోసారి ముంపునకు గురికాకుండా శాశ్వత నివారణ చర్యల్లో భాగంగా హైడ్రా తరహాలో ఇక్కడ కూడా బుడమేరు ఆక్రమణలు తొలగించాలని సీఎం చంద్రబాబు భావిస్తున్నారు. దీనిపై కూడా మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటారు. దీంతో పాటు రాజధాని ప్రాంతంలో ఇప్పటికే హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు నిర్మాణానికి సీఆర్‌డీఏ టెండర్లు ఆహ్వానించగా... తక్షణమే ప్రారంభించాల్సిన నిర్మాణపనులపైనా మంత్రివర్గం చర్చించనుంది.

కేజ్రీవాల్‌కు భారీ ఊరట

- సుప్రీం బెయిల్ మంజూరు... విడుదల
- సీబీఐకి చురకలంటించిన ధర్మాసనం

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు భారీ ఊరట దక్కింది. కేజ్రీవాల్‌కు సుప్రీం కోర్టు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. దీంతో ఆయన ఆరు నెలల త్వరాత తీహార్ జైలు నుంచి విడుదల అయ్యారు. బెయిల్‌కు సంబంధించి కేజ్రీవాల్ సమర్పించిన బెయిల్

- మిగతా 2 లో

నేడు ఎయిమ్స్‌కు ఏచూరి భౌతికకాయం

న్యూఢిల్లీ: సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి భౌతికకాయాన్ని శుక్రవారం సాయంత్రం 6 గంటలకు వసంత్‌కుంజ్‌లోని ఆయన నివాసానికి తరలించారు. శనివారం ఉదయం 8:00 గంటలకు నివాసం నుంచి సీపీఎం కేంద్ర కార్యాలయానికి ఏచూరి భౌతికకాయం తరలించనున్నారు. రేపు ఉదయం 11:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు, పార్టీవర్గాల సందర్శనార్థం పార్టీ కార్యాలయంలో భౌతికయాన్ని

- మిగతా 2 లో

ఉల్లి ఎగుమతులపై ఆంక్షలు ఎత్తివేత

న్యూఢిల్లీ: ఉల్లి ఎగుమతులపై ఆంక్షలు ఎత్తివేస్తూ కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కనీస ఎగుమతి ధర నిబంధన ఎత్తివేసింది. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని డీజీఎఫ్‌టీ శుక్రవారం నోటిఫికేషన్ జారీచేసింది. అలాగే బాస్మతి బియ్యంపైనా కనీస ఎగుమతి ధర నిబంధనను తొలగించినట్లు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

- మిగతా 2 లో

సీబీఎస్ఈకి మంగళం!

- పది విద్యార్థులకు రాష్ట్ర బోర్డు పరీక్షలే...
- భవిష్యత్‌లో 6 నుంచి 9 తరగతులకు కూడా...
- పూర్తిగా రద్దు చేస్తే... బోధన రెండు భాషలలోనూ ఉంటుందా?

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం విద్యా శాఖలో కూడా సంస్కరణల పర్వాన్ని మొదలుపెట్టింది. తొలుత విద్యాశాఖలో ఉన్నతాధికారుల స్థాయిలో మార్పులు చేశారు. తరువాత పాఠశాల స్థాయిలో పని సర్దుబాటు పూర్తి చేసి ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను విజయవంతంగా నిర్వహించారు. ఇప్పుడు విద్యార్థుల స్థాయిలో మార్పులను ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 1,000 సీబీఎస్ఈ పాఠశాలల్లో సెంట్రల్ బోర్డ్ సిలబస్ విధానాన్ని రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ ఒక్క సంవత్సరానికి రాష్ట్రంలో సీబీఎస్ఈ విధానంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు రాష్ట్ర బోర్డు ద్వారా పరీక్షలు రాయడానికి అవకాశం కల్పించాలని ప్రభుత్వ ఆలోచనగా ఉంది. అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులలో సన్నద్ధత లేకపోవడం ముఖ్యమైన కారణంగా కనిపిస్తుండటంతో సీబీఎస్ఈ విధానం రద్దు చేయడానికి ఉన్నత స్థాయిలో నిర్ణయించారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,000 సీబీఎస్ఈ స్కూళ్లలో 6 నుంచి 10 తరగతులలో 4,41,472 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో పదో తరగతిలో 77,478 మంది ఉన్నారు. 2025లో జరిగే సీబీఎస్ఈ 10 పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకోవడానికి గత నెలలో అంతర్గత పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఇంగ్లీషు, లెక్కలు, సైన్సు, సోషల్ సబ్జెక్టులలో పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు రాసిన పదో తరగతి విద్యార్థులలో దాదాపు 70 శాతం మంది ఉత్తీర్ణులు కాలేదు. ఇటువంటి ఫలితాలతో 2024-25లో సీబీఎస్ఈ పదవ తరగతి పరీక్షలు రాస్తే ఉత్తీర్ణత శాతం తగ్గడం ఖాయమని ప్రభుత్వం గుర్తించింది. దీంతో సీబీఎస్ఈ విద్యార్థులకు ఈ ఏడాది రాష్ట్ర బోర్డు పరీక్షలు రాసే విధంగా చర్యలు తీసుకోవాలని యోచిస్తోంది. ప్రస్తుతానికి 10 విద్యార్థులకు సీబీఎస్ఈ పరీక్షలు రద్దు నిర్ణయం మాత్రమే జరిగింది. కానీ భవిష్యత్‌లో 6, 7, 8 9 తరగతులలో కూడా సీబీఎస్ఈ విధానం రద్దయ్యే అవకాశం ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఎందుకంటే రాష్ట్రవ్యాప్తంగా 6 నుంచి 10 తరగతి విద్యార్థులకు సీబీఎస్ఈ, స్టేట్

- మిగతా 2 లో

దళిత మహిళకు దారుణ అవమానం

- విద్యుత్ స్తంభానికి కట్టేసి చితకబాదిన వైనం
- గ్రామంలోకి రాకూడదని హుకుం
- కర్నూలు జిల్లా కల్లుకుంటలో ఘటన
- కులాంతర వివాహ వివాదమే కారణం!

విశాలాంధ్ర-పెద్దకడబూరు : దళిత మహిళపై దాడి ఘటన కర్నూలు జిల్లాలో కలకలం సృష్టించింది. శుక్రవారం పెద్దకడబూరు మండలంలోని కల్లుకుంట గ్రామంలో దళిత మహిళ గోవిందమ్మను స్తంభానికి కట్టేసి ప్రత్యర్థులు ఆమెపై దాడికి పాల్పడ్డారు. ఎనిమిది నెలల క్రితం గ్రామానికి చెందిన గోవిందమ్మ కుమారుడు ఈరన్న అదే గ్రామానికి చెందిన చాకలి నాగలక్ష్మిని ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్నారు. దీనిపై అప్పట్లో నాగలక్ష్మి కుటుంబ సభ్యులు పెద్దకడబూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇద్దరూ మేజర్లు కావడంతో గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీ చేసి వివాహం జరిపించారు. అయితే అదే రోజు రాత్రి

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఇక్కడ ఆక్రమణలు తొలగిస్తే తొలగించారు గానీ, వేరేచోట అవకాశమివ్వండి మరి!

కాలువల పటిష్టత ప్రశ్నార్థకమే?

- మరమ్మతులు చేయకపోతే మనుగడ ప్రమాదం
- 'ఉపాధి'లో ఖర్చు చేసిన కోట్ల రూపాయలు నిరుపయోగమేనా?
- పాలకుల నిర్లక్ష్యం... అధికారుల అలసత్వమే

విశాలాంధ్ర-లింగపాలెం: రాష్ట్రంలో సాగు, తాగునీటి కాలువల దుస్థితి పాలకులకు పట్టడం లేదు. కాలువల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో భారీ వర్షాలు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట పొలాలు, ప్రజల ఆవాసాలు ముంపు బారినపడటమే కాకుండా భారీ స్థాయిలో నష్టం వాటిల్లుతోంది. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ కొరవడటం వెరసి కాలువల ఆనవాళ్లే కనిపించని పరిస్థితికి దారితీసింది. బుడమేరు వాగు ఉప్పొంగడంతో విజయవాడ నగరం నీటి ముంపులో చిక్కుకోవడం ఒకటైతే, మరోవైపు, అనేక గ్రామాల్లో పంట పొలాలు వరద బారినపడిన దుస్థితి నెలకొంది.

వర్షం పడితే ఆ నీటిని పొదుపుగా మళ్లించుకొని అవసరాలు తీర్చుకోవటం కోసం నిర్మించిన కాలువలు ఉపయోగంగా లేవు. దీనివల్ల ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. చెరువులు నిండితే ఒక చెరువు నుంచి మరో చెరువులకు వెళ్లే లింకు చానళ్లు, చెరువులకు వచ్చే నీటి చానళ్లు సక్రమంగా లేకపోవడం వరద నీరు ఊళ్లపై పొలాలను, ఇళ్లను ముంచెత్తుతోంది. దశాబ్దాల తరబడి చానళ్ల నిర్వహణను పట్టించుకోకపోవడం వల్లే ఇటువంటి పరిస్థితి నెలకొందని రైతులు, ప్రజలు వాపోతున్నారు. కాలువల మరమ్మతుకు ఇరిగేషన్ శాఖకు కొన్నాళ్ల నుంచి ప్రత్యేకంగా నిధులు

- మిగతా 2 లో

బస్సును ఢీకొట్టిన కంటెయినర్, లారీ

- ఎనిమిదిమంది దుర్మరణం... 30 మందికి గాయాలు
- చిత్తూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
- ప్రమాదంపై ముఖ్యమంత్రి దిగ్భ్రాంతి
- మృతులకు రూ.ఐదు లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా

2లో

చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం మొగిలి ఘాట్ రోడ్డులో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ దుర్ఘటనలో ఎనిమిది దుర్మరణం చెందారు.

ప్రక్షాళన సవాలే

మూడు నెలలైనా సమీక్షలు లేవు

ఉన్నత విద్యామండలిలో గ్రూపు తగాదాలు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉన్నత విద్యామండలి ప్రక్షాళన ప్రభుత్వానికి పెద్ద సవాల్‌గా మారింది. గత ప్రభుత్వ హయాంలో ఉన్న వారికే కీలక పదువులు కట్టబెట్టడంతో ఈ దుస్థితి నెలకొందన్న విమర్శలున్నాయి. అధికారులు రెండు గ్రూప్‌లుగా విడిపోయి... ఇష్టానుసారం కార్యకలాపాలు కొనసాగించడంతో ఈ పరిస్థితి ఎదురైనట్లు భావిస్తున్నారు. దీనికితోడు ఉన్నత విద్యామండలి ప్రక్షాళనపై ఇంతవరకు ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడమూ ప్రధాన కారణంగా తెలుస్తోంది. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేశ్ బాధ్యతలు స్వీకరించాక ఉన్నత విద్యామండలిని ప్రక్షాళన చేస్తామని ప్రకటించినప్పటికీ... ఇప్పటివరకు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. మంత్రి లోకేశ్ బాధ్యతలు స్వీకరించిన వెంటనే విద్యార్థి, యువజన సంఘాల నేతలు కలిసి అనేక సమస్యలు విన్నవించారు. ప్రతి అంశాన్ని ఉపాధ్యాయ, విద్యార్థి, యువజన సంఘాలతో చర్చించి, మెరుగైన విద్యా విధానం తీసుకొస్తామని, విద్యావ్యవస్థ ప్రక్షాళనకు కృషి చేస్తామని లోకేశ్ భరోసా ఇచ్చారు. ఉన్నత విద్యామండలి అధ్వర్యంలో నిర్వహించే ప్రవేశాల విధానం గందరగోళంగా మారింది. దీని అధ్వర్యంలో యేటా నోటిఫికేషన్ జారీజేసి... వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. 2024-25 విద్యా సంవత్సరానికిగాను ఏపీఈఏపీసెట్ 2024, ఈసెట్, పీజీసెట్, ఎడ్‌సెట్ తదితర 11 విభాగాల్లో

- మిగతా 2 లో

సీబీఎస్ఈకి మంగళం!

(మొదటిపేజీ తరువాయి)
సిలబస్‌లతో సంబంధం లేకుండా అందరికీ ఒకే రకమైన ద్విభాష అచ్చు పుస్తకాల పంపిణీ జరిగింది. అన్ని పాఠశాలల్లో ఒకే రకమైన సిలబస్‌ను బోధిస్తున్నారు. తాజాగా రెండు రోజుల క్రితం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లోనూ ఎన్‌సీఈఆర్‌టీ రూపొందించిన ప్రశ్న పత్రాలతోనే ఎఫ్ఏ-1 (సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్-1 (2024 -25) పరీక్షలను అన్ని పాఠశాలల్లో ఆరు నుంచి తొమ్మిది తరగతి వరకు నిర్వహించారు. ప్రశ్న పత్రాన్ని కూడా రెండు భాషల్లో ముద్రించారు. సీబీఎస్ఈ, స్టేట్ సిలబస్ అనే తేడా లేకుండా విద్యార్థులందరూ ఈ ప్రశ్న పత్రాలతోనే పరీక్షలు రాశారు.
వాస్తవానికి 1,000 సీబీఎస్ఈ స్కూళ్లకు సెంట్రల్ బోర్డ్ నుంచి ప్రశ్నాపత్రాలు ఆన్ లైన్ లో పంపిణీ కావాల్సి ఉంది. పూర్తి ఇంగ్లీష్ మీడియంలో పరీక్షలు జరగాల్సి ఉంది. కానీ అలా జరగలేదు. ఈ పరిణామాలన్నింటినీ పరిశీలిస్తే, రానున్న రోజులలో సీబీఎస్ఈ విధానాన్ని పూర్తిగా రద్దు చేసి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్టేట్ సిలబస్‌ను అమలు చేస్తారని స్పష్టంగా తెలుస్తోంది. అయితే బోధన తెలుగు మీడియంలో ఉంటుందా? ఇంగ్లీష్ మీడియంలో ఉంటుందా? లేక రెండు భాషలలోనూ ఉంటుందా? అనే అంశం తేలాల్సి ఉంది.

హారిస్‌తో ఇక చర్చ వద్దు: ట్రంప్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష పదవి కోసం ఎన్నికలు నవంబరులో జరగనున్నాయి. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి, దేశ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ తలపడుతున్నారు. ఇదే క్రమంలో ఇటీవల ఇద్దరు అభ్యర్థులు సంవాదం హాట్‌టాపిక్‌గా మారింది. చర్చలో హారిస్ పై చేయి సాధించడం చర్చకు దారితీసింది. ఈ పరిణామాల క్రమంలో కమలా హారిస్‌తో మరో డిబేట్‌కు తాను సిద్ధం కాదని డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈమేరకు ఆయన సామాజిక మాధ్యమంలో పోస్ట్ పెట్టారు. డెమొక్రాట్ల రాడికల్ లెఫ్ట్ అభ్యర్థి కమలా హారిస్‌తో డిబేట్‌లో గెలుపు తనదే అని

ప్రకటించుకున్నారు. అయితే సర్వేలు భిన్నంగా ఉన్నాయంటూ అసహనం వ్యక్తంచేశారు. పరాజిత హారిస్‌తో మరో చర్చలో పాల్గొనేందుకు సిద్ధంగా లేనని ట్రంప్ పేర్కొన్నారు. అధ్యక్ష రేసు నుంచి బైడెన్ వైదొలగక ముందు ట్రంప్, బైడెన్‌ల మధ్య తొలి డిబేట్ జరిగింది. ట్రంప్, హారిస్‌ల మధ్య జరిగినది రెండవది. దీంతో మూడో డిబేట్‌కు సిద్ధంగా లేనని ట్రంప్ ప్రకటించారు.

ట్రంప్‌పై ఉన్న రెండు నేరాభియోగాలు కొట్టివేత

ట్రంప్‌పై రెండు నేరాభియోగాలను అమెరికా కోర్టు కొట్టివేసింది. 2020 ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకొన్న కేసులో ట్రంప్‌కు ప్రమేయం ఉందనే అభియోగాల్లోని రెండు కౌంటీలను జార్జియాకు చెందిన ఫాల్టన్ కౌంటీ న్యాయమూర్తి తోసిపుచ్చారు. ట్రంప్‌పై ఉన్న ఎనిమిది ఆరోపణలతో పాటు మిగిలిన కేసుల విచారణకు అనుమతించారు. ఈ తీర్పుపై మరోసారి విజయం సాధించామని ట్రంప్ తరఫున న్యాయవాది పేర్కొన్నారు.

అదే జరిగితే నాటోతో యుద్ధమే: పుతిన్

మాస్కో: సుదూర లక్ష్యాలు ఛేదించే ఆయుధాలతో రష్యాపై దాడికిగాను ఉక్రెయిన్‌కు పశ్చిమ దేశాలు సహకరిస్తున్నాయని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆరోపించారు. ఉక్రెయిన్ విషయంలో పశ్చిమ దేశాల తీరును దుయ్యబట్టారు. రష్యాతో యుద్ధానికి నాటో, దాని మిత్రదేశాలు కాలు దువ్వుతున్నట్లుగా తాజా పరిణామాలు సూచిస్తున్నాయని వ్యాఖ్యానించారు. తమ భూభాగంపై మరింత లోతైన దాడులు చేసే విధంగా ఉక్రెయిన్‌ను ప్రోత్సాహాన్ని అందిస్తేగనుక తమతో యుద్ధానికి నాటో సిద్ధమైనట్లుగానే భావించాల్సి ఉంటుందని పుతిన్ గురువారం హెచ్చరించారు. రష్యాలో పశ్చిమ దేశాల ఆయుధాల ప్రయోగానికి సంబంధించిన నిబంధనల సరళీకరణపై అమెరికా, బ్రిటన్ ఉన్నత దౌత్యాధికారులతో చర్చలో పుతిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. రెండున్నరేళ్లుగా రష్యాతో

తలపడుతున్న ఉక్రెయిన్... ఆయుధాల ప్రయోగానికి సంబంధించిన నిబంధనల సరళీకరణ కోసం ఒత్తిడి తెస్తోంది. నాటో, అమెరికా, యూరోప్ దేశాలు రష్యాతో యుద్ధానికి కాలు దువ్వుతున్నట్లే' అని అన్నారు. అదే నిజమైతేగనుక మారిన యుద్ధనీతి దృష్ట్యా తమకు వచ్చే బెదిరింపుల ఆధారంగా తగు నిర్ణయాలను తీసుకుంటామని పుతిన్ తెలిపారు. రష్యాలో మరింత చొచ్చుకుపోయేలా దాడులు చేసేందుకు కీవ్‌కు మద్దతివ్వడమంటే నాటో దేశాలు నేరుగా సైనిక చర్యలో భాగమా అన్నది నిర్ణయించుకోవాలన్నారు. తక్కువ ఆంక్షలతో అత్యంత శక్తిమంతమైన ఆయుధాల కల్పన కోసం పశ్చిమ దేశాలపై కీవ్ ఒత్తిడి పెంచుతున్న క్రమంలో పుతిన్ చేసిన వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. కాగా తూర్పు ఉక్రెయిన్‌లో రష్యా దూకుడు కొనసాగిస్తోంది.

కాలువల పటిష్టత ప్రశ్నార్థకమే?

(మొదటిపేజీ తరువాయి)
కేటాయించకపోయినప్పటికీ ఉపాధి హామీ పథకంలో వీటి మరమ్మతుల కోసం కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నారు. ఖర్చు పెడుతున్న నిధులు దుర్వినియోగం అవుతున్నాయా? సద్వినియోగం అవుతున్నాయా? అనే ప్రశ్న ఇప్పుడు తలెత్తుతోంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఎనిమిది వేల కిలోమీటర్ల దూరంలో దాదాపు రెండు వేల కాలువలు ఉన్నాయి. వీటిలో దాదాపు 60 శాతం కాలువలు సక్రమంగా లేవనేది ఇరిగేషన్ శాఖ అధికారులే అంటున్నారు. ఈ కాలువలు సరిగా ఉంటే ఉపద్రవాలు ఎదురుకావు. 2005లో ఉపాధి పథకం ప్రారంభమైంది. అప్పటి నుంచి ఆ పథకం కింద కాలువల మరమ్మతుల కోసం ప్రతి ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. అయితే ఆ కాలువల పనులను పరిశీలిస్తే కూలీలకు ఉపాధి చూపుతున్నామని చెప్పుకుంటున్నారేగానీ కాలువలు అభివృద్ధి చెందుతున్నాయా లేదా అనే విషయాలపై శ్రద్ధ చూపటం లేదనే విమర్శలు ఉన్నాయి.
కాలువలపై శ్రద్ధ ఎందుకు చూపడం లేదని 'ఉపాధి' అధికారులను ప్రశ్నిస్తే అభివృద్ధితో తమకు సంబంధం లేదని, కూలీలకు ఉపాధి మాత్రమే చూపిస్తున్నామని కొందరు అధికారులు అంటున్నారు. 'ఉపాధి' అమలులోకి వచ్చిన తర్వాత ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో కాలువల పనుల కోసం ఇప్పటివరకు దాదాపు రూ.2 వేల కోట్లు ఖర్చు పెట్టారు. ఏ ఏడాదికి ఆ ఏడాది చేసిన కాలువలోనే పనులు చేయిస్తూ వస్తున్నారు. చేసే పనులు కూడా ఉపయోగంగా ఉండటం లేదు. ఉపాధి నిధులతో పక్కాగా కాలువలను నిర్మించవచ్చు కదా అని ప్రశ్నిస్తే అలా చేయటం వల్ల కూలీలకు పనులు ఉండవని కొందరు అధికారులు విచిత్ర వాదన చేస్తున్నారు. ఈ వాదన ఎంత మాత్రం సమంజసం కాదని రైతులు అంటున్నారు. ఒక చెరువు నుంచి మరో చెరువుకు లింకు కాలువ దూరం 3 నుంచి 5 కిలోమీటర్లు ఉంటుంది. 5 కిలోమీటర్ల పొడవున ఉన్న కాలువ పూడిక తీసి కాలువకు రెండు వైపులా గట్టును పటిష్టం చేస్తే దాదాపు రూ.5 లక్షలు ఖర్చవుతుందని, ఇలా ఒకసారి చేస్తే దాదాపు 8 ఏళ్ల వరకు కాలువకు ఎటువంటి ఇబ్బంది ఉండదని ఇరిగేషన్ శాఖ అధికారులు అంటున్నారు. ఇప్పటివరకు ఖర్చు చేసిన నిధులతో ఎన్నో కాలువలను పటిష్టంగా నిర్మించుకోవచ్చన్న విషయం స్పష్టమవుతోంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఉన్న ఈ కాలువల ద్వారా లక్షా 60 వేల ఎకరాలకు సాగునీరు సరఫరా చేసే సామర్థ్యం ఉంది. కానీ కాలువల రూపురేఖలే మారిపోవడంతో పూర్తిస్థాయిలో పంటలకు నీరందడం లేదు. కాలువల ద్వారా సక్రమంగా నీరు ప్రవహించడం లేదు. అసలు కాలువలు ఉన్నాయా? అనే ప్రశ్న తలెత్తుతోంది. మెట్ట ప్రాంతంలో, డెల్టాలో కాలువలను జీవనాడులుగా తవ్వించారు. ఇప్పుడు వీటి తీరే మారింది. ఈ మధ్య కురుస్తున్న ఎడతెరిపిలేని భారీ వర్షాలతో కాలువల దుస్థితి వెలుగు చూస్తోంది. ఉపాధి పనులు గుర్తించేటప్పుడు గ్రామ సభలు నిర్వహించి పనులు ఎంపిక చేస్తారు. పనులు జరిగే సమయంలో ప్రజలు, రైతులు, ప్రజా ప్రతినిధుల పర్యవేక్షణ కొరవడటంతో ఇష్టానుసారం పనులు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దీనివల్ల నిధులు వృధా అవటమే కాకుండా చేసిన పనులు కూడా ఉపయోగంగా ఉండటం లేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మెట్ట ప్రాంతంలోని కాలువల వల్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. నీరు సక్రమంగా ప్రవహించక పంటలకు నష్టం కలిగింది. కొన్ని కాలువలు ఇళ్లను ముంచాయి. అనేక మంది కాలువలను ఆక్రమించేసుకుని వాటి స్వరూపాన్ని మార్చేశారు. ఆక్రమణలను తొలగించకపోవడం వల్ల లింగపాలెం మండలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనేక కాలువలు ఇప్పటికే కనుమరుగయ్యాయి. ఉన్న కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. ఉన్నతాధికారులు కాలువల మరమ్మతులపై ఇప్పటికైనా దృష్టి పెట్టాలని, పటిష్టంగా మరమ్మతులు చేపట్టాలని, పనులపై ఇరిగేషన్ శాఖ పర్యవేక్షణ చేయాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు. పర్యవేక్షణ లేక పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఉన్న కాలువలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ప్రతి ఒక్కరిలో ఆందోళన ఉంది.

బస్సును ఢీకొట్టిన కంటెయినర్, లారీ

విశాలాంధ్ర -పలమనేరు: చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం మొగిలి ఘాట్ రోడ్డులో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ దుర్ఘటనలో ఎనిమిది దుర్మరణం చెందగా... 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. చిత్తూరు నుంచి బెంగళూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సును మొగిలి ఘాట్ వద్ద ఎదురుగా ఇనుప కమ్మీలతో వస్తున్న భారీ కంటైనర్ ఢీకొట్టింది. అదే సమయంలో వెనుక వస్తున్న మరో లారీ కూడా బస్సును ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. దీంతో బస్సు నుజ్జు నుజ్జు అయింది. బస్సులో ఉన్న డ్రైవర్ తో పాటు ఆరుగురు ప్రయాణికులు అక్కడికక్కడే చనిపోగా... మరో 30 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని ఆస్పత్రి తరలిస్తుండగా మరొకరు మృతి చెందారు. ఈ ఘాట్ రోడ్డులో ఇనుప కమ్మీలతో వస్తున్న భారీ కంటైనర్ అతివేగంతో అదుపుతప్పి రోడ్డు డివైడర్ను

ఢీకొని తదుపరి బస్సును ఢీకొన్నట్లు అధికారులు చెబుతున్నారు. బస్సును ముందువైపు భారీ కంటైనర్ వెనకనుంచి అదుపుతప్పిన మరో లారీ ఢీకొనడంతో ప్రమాద తీవ్రత పెరిగింది. రెండు లారీల మధ్య బస్సు చిక్కుకోవడంతో స్థానికులు పోలీసులు అతి కష్టం మీద బస్సులో ప్రయాణికులను వెలుపలికి తీసుకొచ్చారు. ప్రమాదం జరిగిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అంబులెన్స్ ద్వారా గాయపడ్డ వారిని పలమనేరు , చిత్తూరు బంగారు పాళ్యం ఆసుపత్రులకు తరలించారు. సంఘటనా స్థలానికి హుటాహుటిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ,జిల్లా ఎస్పీ మణికంత చందోల్ వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదం వల్ల పలమనేరు- చిత్తూరు జాతీయ రహదారిపై ట్రాఫిక్ అంతరాయం కలిగింది. చిత్తూరు జిల్లా మొగిలి ఘాట్ రోడ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసి మృతి చెందిన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఒక్కొక్కరికి రూ.ఐదు లక్షలు ఎక్స్ గ్రేషియా ప్రకటించారు. గాయపడ్డ వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. తీవ్రంగా గాయపడిన ప్రయాణికులను మెరుగైన వైద్యం కోసం వేలూరు ఆసుపత్రికి తరలించారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి కూడా ఈ ప్రమాద ఘటనపై ఆరాతీసి గాయపడ్డ వారికి మెరుగైన వైద్యులు అందించాలని ఆదేశించారు.

ప్రక్షాళన సవాలే

(మొదటిపేజీ తరువాయి)
వెబ్ కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు చేపట్టి... వరుసవారీగా సీట్లు ఖరారు చేస్తారు. పండుగ, సెలవు దినాల్లోనూ వెబ్ కౌన్సెలింగ్ పూర్తయిన డిగ్రీ, పీజీ విద్యార్థులు స్వయం నివేదికల షెడ్యూలు ఉండటం విమర్శలకు దారితీస్తోంది. ఆ సమయంలో స్వయం నివేదికలు సమర్పించని విద్యార్థులంతా సీట్లు కోల్పోయే ప్రమాదం ఉంది.

ఉపాధ్యాయ అవార్డుల్లో అవకతవకలు

ఉపాధ్యాయ అవార్డుల్లోను అనేక అవకతవకలు జరిగాయి. దీనిపై సమగ్ర విచారణకు ప్రభుత్వం ఆదేశిస్తే వాస్తవాలు వెలుగు చూసే అవకాశముంది. ప్రతిష్టాత్మకంగా ఎంపిక చేయాల్సిన అవార్డులను అనర్హులకు కేటాయించినట్లుగా తెలిసింది. గత ప్రభుత్వ మద్దతుదారులకు అనుకూలంగా వ్యవహరించిన హేమచంద్రారెడ్డి విధానాలతోనే అవార్డుల విధానం పక్కదారి పట్టినట్లు విమర్శలున్నాయి. కృష్ణా యూనివర్సిటీకి చెందిన అర్హతలేని వారికి అవార్డులు ఇవ్వడంతో వ్యతిరేకత నెలకొంది. ప్రభుత్వం తీసుకోవాల్సిన నిర్ణయాలను ఇన్‌చార్జి వైస్ చైర్మన్ కె.రామ్మోహనరావు, కార్యదర్శి నజీర్ అహ్మద్ తీసుకుంటున్నారు. ఇందుకు నిదర్శనమే ఉన్నత విద్యామండలి వారానికి ఐదు రోజులకు బదులు ఆరు రోజులు కొనసాగుతుందని ఉత్తర్వులు జారీజేయడమే. దీనిపై ప్రభుత్వం ఇప్పటివరకూ ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

ప్రక్షాళన చేయాలి: ఏఐవైఎఫ్

ఉన్నత విద్యామండలిని తక్షణమే ప్రభుత్వం ప్రక్షాళన చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మహంకాళి సుబ్బారావు డిమాండ్ చేశారు. ఉన్నత విద్యామండలి ఇన్‌చార్జి చైర్మన్ కె.రామ్మోహనరావు, కార్యదర్శి నజీర్ అహ్మద్‌తో ఉద్యోగులకు తీవ్రనష్టం వాటిల్లుతోందని తెలిపారు. ఉపాధ్యాయ అవార్డుల్లో జరిగిన అవకతవకలపైనా సమగ్ర విచారణకు ఆదేశించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో అనేక ఆరోపణలు ఎదుర్కొని... ప్రస్తుతం కొనసాగుతున్న వారిని విధుల నుంచి తొలగించాలని కోరారు. సెలవు రోజుల్లో వెబ్ కౌన్సెలింగ్‌లో స్వీయ నివేదికలు సమర్పించే విధానాన్ని పక్కనపెట్టాలన్నారు.
ఉన్నత విద్యామండలి కార్యాలయాల్లో గ్రూప్‌లు లేకుండా, మంచి వాతావరణం ఉండేలా చూడాలని, లేకుంటే విద్యా వ్యవస్థపై దాని ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. సెలవులు, పండుగ దినాల్లో విద్యార్థులు స్వయం నివేదికలు ఇచ్చేలా షెడ్యూలు విధించకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఏచూరికి జేఎన్‌యూ అరుణాంజలి

న్యూఢిల్లీ: సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి (72)కి జేఎన్‌యూ విద్యార్థులు అరుణాంజలి ఘటించారు. ఏచూరి భౌతికకాయాన్ని ఎయిమ్స్ ఆసుపత్రి నుంచి తొలుత జేఎన్‌యూకు తీసుకెళ్లగా వందల మంది విద్యార్థులు ఆయనకు నివాళులర్పించారు. లాల్ సలాం అంటూ నినదించారు. జేఎన్‌యూఎస్‌యూ మాజీ అధ్యక్షుడు కన్హయ్య కుమార్‌తో పాటు విద్యార్థి సంఘాల నేతలు, విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది ఆయనకు పుష్పాంజలి ఘటించారు. అంతకుముందు ఎయిమ్స్‌లో ఏచూరి భౌతికకాయంపై ఎర్రజెండాను కప్పి సీపీఎం అగ్రనాయకులు నివాళు లర్పించారు. జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ విద్యార్థులు నివాళు లర్పించిన అనంతరం ఆయన భౌతికకాయాన్ని నేరుగా దిల్లీలోని నివాసానికి తరలించారు. అక్కడ సీపీఎం నేతలు బృందా కారత్, ఎంఏ బేబీ, అశోక్ ధావ్లే, విజయ రాఘవన్, ఎంపీ వాసుదేవన్ తదితరులు నివాళులర్పించారు. జేఎన్‌యూ విద్యార్థిగా ఏచూరి 1974లో ఎస్‌ఎఫ్‌ఐ నుంచి తన ప్రస్థానాన్ని ప్రారంభించి... 1977లో జేఎన్‌యూ విద్యార్థి సంఘం అధ్యక్షుడు అయిన విషయం విదితమే.

ఉల్లి ఎగుమతులపై ఆంక్షలు ఎత్తివేత

(మొదటిపేజీ తరువాయి)
తెలిపారు. ప్రస్తుతం టన్నుకు కనీస ఎగుమతి ధరను 950 డాలర్లుగా కేంద్రం నిర్ణయించింది. ఈ నిబంధన తొలగింపుతో బాస్మతి బియ్యం ఎగుమతులతో పాటు రైతుల ఆదాయం కూడా పెరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. మహారాష్ట్ర ఎన్నికల వేళ కేంద్రప్రభుత్వం ఈమేరకు నిర్ణయాలు తీసుకోవడం చర్చకు దారితీసింది. దేశీయంగా ఉల్లి ధరలు పెరగకుండా ఎగుమతులపై కేంద్రం గతేడాది ఆంక్షలు విధించింది. తొలుత ఉల్లిపై 40 శాతం ఎగుమతి సుంకం విధించింది. ఈ ఏడాది మేలో ఎగుమతుల సుంకం తొలగించినప్పటికీ.. కనీస ధరను టన్నుకు 550 డాలర్లుగా నిర్ణయించింది. ఉల్లి ఎగుమతులపై ఆంక్షలు విధించడంపై మహారాష్ట్ర రైతులు ఆగ్రహంగా ఉన్నారు. చాలా సందర్భాల్లో నిరసనలు చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయేపై ఆ ప్రభావం పడింది. నాసిక్ ప్రాంతంలో ఉల్లి రైతుల ఆగ్రహాన్ని చవిచూసినట్లు ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే తెలిపారు. ఈ నేపథ్యంలో ఉల్లి ఎగుమతులపై ఆంక్షలు తొలగించడం గమనార్హం.

దళిత మహిళకు దారుణ అవమానం

(మొదటిపేజీ తరువాయి)
దళిత కాలనీపై చాకలి నాగలక్ష్మి కుటుంబ సభ్యులు దాడి చేశారు. దీనిపై పోలీసులు అప్పట్లో కొందరిపై కేసులు కూడా నమోదు చేశారు. అప్పటి నుంచి గోవిందమ్మ కుటుంబం ఊరు వదిలి వెళ్లింది. రెండు రోజుల క్రితం గోవిందమ్మ తన ఇంటికి భయం భయంతో వచ్చి ఎవరికీ కనిపించకుండా ఉంది. అయితే ఈ విషయాన్ని పసిగట్టిన కోడలు నాగలక్ష్మి కుటుంబ సభ్యులు చాకలి నాగలమ్మ, మరికొంతమంది విద్యుత్ సరఫరాను నిలిపివేయించి, దళితురాలైన గోవిందమ్మ ఇంటికి వెళ్లి గ్రామంలోకి రాకూడదని చెప్పినప్పటికీ ఎందుకు వచ్చావంటూ ఘర్షణకు దిగారు. ఆమెను లాక్కొని వెళ్లి తమ కాలనీలో విద్యుత్ స్తంభానికి కట్టేసి వందలాది గ్రామస్తుల సమక్షంలోనే విచక్షణారహితంగా కొట్టారు. నీ కుమారుడు కులాంతర వివాహం చేసుకున్నాడని, మీ కుటుంబాన్ని గ్రామ బహిష్కరణ చేశామని, అయినా గ్రామంలోకి ఎలా వచ్చావంటూ గోవిందమ్మను చితకబాదారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అక్కడ ఉన్న వారిని చెదరగొట్టి, అపస్మారక స్థితిలో ఉన్న గోవిందమ్మను చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. కాగా దళిత మహిళ గోవిందమ్మపై దాడి ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నిరంజన్ రెడ్డి విలేకరులకు తెలిపారు. బాధితురాలి కుమారుడు ఈరన్న తమ కుమార్తెను కులాంతర వివాహం చేసుకున్నాడనే ద్వేషంతో చాకలి నాగలమ్మ కుటుంబీకులు, మరికొంత మంది కలిసి దళిత మహిళ గోవిందమ్మపై దాడికి పాల్పడ్డారని ఆయన వివరించారు. గోవిందమ్మ ఫిర్యాదు మేరకు చాకలి నాగలమ్మ కుటుంబ సభ్యులు చాకలి భూలక్ష్మి, చాకలి నర్సమ్మ, చాకలి ఉసేనమ్మ, చాకలి లక్ష్మి, చాకలి రంగమ్మ, చాకలి నాగరాజు, చాకలి ఉసేని, చాకలి రాముడు, చాకలి బీమారాజు, చాకలి గుండమ్మతో పాటు మరికొంతమందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలని ఆందోళన

కల్లుకుంట గ్రామంలో బీసీ కులస్తులు... దళిత మహిళ గోవిందమ్మను విద్యుత్ స్తంభానికి కట్టేసి దాడి చేయడం అత్యంత దారుణమని దళిత సంఘాల నాయకులు లక్ష్మీనారాయణ, జయన్న, రామతీర్థం తీవ్రంగా ఖండించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో సీఐ మంజునాథ్, ఎస్ఐ నిరంజన్ రెడ్డిని కలిసి ఘటనపై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వందలాది మంది చూస్తుండగా గోవిందమ్మను వివస్త్రను చేసి స్తంభానికి కట్టేసి, నీ కుమారుడు పెద్ద కులం అమ్మాయిని ఎలా వివాహం చేసుకొన్నాడని బెదిరించి, దాడి చేయడం దారుణమన్నారు. తక్షణమే నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నిందితులను కఠినంగా శిక్షించకపోతే దళిత సంఘాల అధ్వర్యంలో ఆమరణ నిరాహార దీక్షకు పూనుకుంటున్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు అమరేష్, కదిరికోట బతుకమ్మ, మాల నరసప్ప, మాల మధుబాబు, మాల రంగన్న, ఆనంద్, నెపోలియన్, పీడీఎస్‌యూ నాయకులు రాజేష్, చార్లెస్, కృపానందం, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర సాయమేది?

(మొదటిపేజీ తరువాయి)
బయటపడ్డారు. దీంతో ఇంట్లో ఉన్న వస్తువులన్నీ నీట మునిగాయి. టీవీలు, ఫ్రిజ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులన్నీ వరదపాలయ్యాయి. కార్లు, ద్విచక్ర వాహనాలు పది రోజులపాటు బురదనీటిలో ఉండడంతో పూర్తిగా దెబ్బతిన్నాయి. చివరకు మంచాలు, కుర్చీలు, పరుపులు, పుస్తకాలు, బీరువాలు, గ్యాస్ స్టౌవ్‌లు, ఇతర వంట సామగ్రి అన్నీ వరదకు కొట్టుకుపోయాయి. వందల సంఖ్యలో పశువులు, కోళ్లు, మేకలు, గొర్రెలు చనిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం రూ.6,880 కోట్లు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా వేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపింది. వరదల వల్ల అత్యధికంగా ఆర్‌అండ్‌బీ శాఖకు రూ.2,164 కోట్లు నష్టం వాటిల్లగా, జలవనరుల శాఖకు రూ.1,568 కోట్లు, పురపాలకశాఖకు రూ.1,160 కోట్లు, రెవెన్యూశాఖకు రూ.750 కోట్లు, విద్యుత్‌శాఖకు రూ.480 కోట్లు, వ్యవసాయ, ఉద్యానవన శాఖలకు రూ.340 కోట్లు... ఇలా శాఖల వారీగా జరిగిన నష్టాలపై కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం నివేదిక పంపింది. కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, కేంద్ర బృందాలు కూడా ఇప్పటికే వరద ప్రాంతాలను పరిశీలించి వెళ్లాయి. కానీ ఇంతవరకు కేంద్రం నష్టపరిహారం కింద పైసా కూడా విదల్చలేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం క్షేత్రస్థాయిలో అధికారులను ఇంటింటికీ పంపి వారికి జరిగిన నష్టాలను అంచనా వేస్తుంది. మరోపక్క ముంపునకు గురై పాడైన ఎలక్ట్రానిక్ వస్తువులకు, మోటారు వాహనాలకు ప్రభుత్వమే మరమ్మతులు చేయించడమా, లేక నష్టపరిహారం అందించాలా ? ఇస్తే ఎంత ఇవ్వగలమనే దానిపై కసరత్తు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయాన్ని బట్టి బాధితులకు నష్టపరిహారం ప్రకటించాలనే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఎదురుచూస్తోంది.

ఉత్తరాంధ్ర, ఏలేరు విలయం మరో దెబ్బ

కృష్ణా వరద, బుడమేరు ముంపు నుంచి కోలుకోకముందే బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురిచిన భారీ వర్షాలు ఉత్తరాంధ్రను అతలాకుతలం చేశాయి. అనేక గ్రామాలు నీట మునిగాయి. వాగులు, వంకలు పొంగిపొర్లడంతో రహదారులకు గండ్లు

పడి దెబ్బతిన్నాయి.
ఏలేరు ఉగ్రరూపం దాల్చింది. దీంతో ఒక్క కాకినాడ జిల్లాలోనే 62 వేల ఎకరాల పంటలు నీట మునిగాయి. పెట్టిన పెట్టుబడి అంతా వరదార్పణం కావడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఎకరా మాగాణికి రూ.10 వేలు నష్టపరిహారం చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. మిగిలిన పంటలకు కూడా ఎంత ఇవ్వాలనే దానిపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా తక్షణమే జాతీయ విపత్తుగా ప్రకటించి... ఉదారంగా ఆదుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నేడు ఎయిమ్స్‌కు ఏచూరి భౌతికకాయం

(మొదటిపేజీ తరువాయి)
ఉంచనున్నారు. అనంతరం రేపు సాయంత్రం 5 గంటలకు భౌతిక కాయాన్ని మళ్లీ ఎయిమ్స్‌కు తరలిస్తారు. ఆయన భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులు మెడికల్ కాలేజీకి అప్పగించనున్నారు. తన భౌతిక కాయాన్ని మెడికల్ కాలేజీ పరిశోధనలకు అప్పగించాలని గతంలో పార్టీ నేతలకు సీతారాం ఏచూరి చెప్పారు.

కేజ్రీవాల్‌కు భారీ ఊరట

(మొదటిపేజీ తరువాయి)
బాండ్లను రౌస్ అవెన్యూ కోర్టు ఆమోదించింది. ఆయనను విడుదల చేయాలని తీహార్ జైలు అధికారులకు ఆదేశాలు జారీ చేయడం... విడుదలకు అవసరమైన ప్రక్రియ పూర్తి కావడంతో బెయిలు మంజూరైన కొన్ని గంటల వ్యవధిలోనే ఆయన జైలు నుంచి బయటకు వచ్చారు. ఆప్ శ్రేణులు, కేజ్రీవాల్ అభిమానులు జైలు వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకొని ఆయనకు స్వాగతం పలికారు. తమ అధినేత విడుదల కావడంతో సంబరాల్లో మునిగి తేలారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ వారికి అభివాదం చేస్తూ కనిపించారు. ఈ కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, ఉజ్జల్ భూయన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా... 'దిల్లీ మద్యం విధానం కేసులో సీబీఐ అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసింది. కానీ ఎందుకు అరెస్ట్ చేసిందన్న కారణాలపై స్పష్టతలేదు. సీబీఐ సమాధానాలు సైతం అర్థవంతంగా లేవు. అందుకే కేజ్రీవాల్ అరెస్ట్‌తో పాటు జైలు శిక్షను కొనసాగించలేము. కేజ్రీవాల్‌ని సైతం వాంగ్మూలం ఇవ్వమని బలవంతం చేయలేము' అని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది.

సీబీఐ తీరుపై తప్పుబట్టిన న్యాయమూర్తులు

కేజ్రీవాల్ బెయిల్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ కేజ్రీవాల్ విషయంలో సీబీఐ వ్యవహరించిన తీరును తప్పుబట్టారు. దేశంలో సీబీఐ పరిస్థితిని వర్ణిస్తూ... 'పంజరంలో ఉన్న చిలుక' మాదిరి వ్యవహరించకూడదని సూచించారు. సీబీఐ స్వతంత్రంగా వ్యవహరించడం లేదని, కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో పనిచేసే సంస్థగా పనిచేస్తుందనే అర్థంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే సీబీఐ... కేంద్ర ప్రభావంతో పనిచేసే 'బోనులో ఉన్న చిలుక' కాదని నిరూపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సీబీఐ అంటే 'స్వేచ్ఛగా విహరించే చిలుకలా' వ్యవహరించాలని తెలిపారు. తనపై వ్యక్తం అయిన అనుమానాలను సీబీఐ నివృత్తి చేసుకోవాలన్నారు. అలాగే సీఎం కేజ్రీవాల్‌ను సీబీఐ అరెస్ట్ చేసిన విధానంపై జస్టిస్ భుయాన్ విమర్శలు గుప్పించారు. ఆయన్ను కేవలం జైలులో ఉంచి వేధించాలన్న ఉద్దేశంతో ప్రణాళిక ప్రకారం అరెస్ట్ జరిగినట్లు కనిపిస్తోందన్నారు. అయితే 'పంజరంలో బంధించిన చిలుక' పదాన్ని 2013లో సీబీఐపై సుప్రీంకోర్టు ఉపయోగించింది. కేంద్ర దర్యాప్తు సంస్థ స్వతంత్రమైనది కాదని కేంద్ర ప్రభుత్వ ప్రభావంతో పని చేస్తుందని వ్యాఖ్యానించింది. కోర్టు పరిశీలనతో ఏకీభవించిన అప్పటి సీబీఐ డైరెక్టర్ రంజిత్ సిన్హా... ఈ వ్యాఖ్యను అంగీకరించారు. సీబీఐ విధుల్లో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుంటోందన్న భావనతో ప్రతిపక్షాలు సీబీఐని 'పంజరంలో చిలుక' అనే మాటను తరచుగా ఉపయోగిస్తుంటాయి. తాజాగా సుప్రీంకోర్టు విచారణతో ఈ పదబంధం మళ్లీ తెరపైకి వచ్చింది. మరోవైపు విచారణ సందర్భంగా బెయిల్‌పై జస్టిస్ సూర్యకాంత్ సైతం కీలక వ్యాఖ్యలు చేశారు. సీబీఐ అరెస్టు సక్రమైందని తెలిపిన న్యామూర్తి.. సుదీర్ఘంగా జైలులో నిర్బంధించడం అంటే.. వ్యక్తి హక్కులను హరించినట్లే అవుతుందని వ్యాఖ్యానించింది. విచారణ ప్రక్రియ శిక్షగా మారకూడదని... ఈడీ కేసులో బెయిల్ లభించిన వెంటనే సీబీఐ అరెస్ట్ చేయడం సరైంది కాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆర్టికల్ 21 ప్రకారం సాధారణంగా కోర్టులు స్వేచ్ఛ వైపే మొగ్గుచూపుతాయని తెలిపారు. కాగా మద్యం కుంభకోణానికి సంబంధించి మనీలాండరింగ్ కేసులో తొలుత కేజ్రీవాల్‌ను మార్చి 21న ఈడీ అదుపులోకి తీసుకుంది. అనంతరం జైలులో ఉన్న కేజ్రీవాల్‌ను జూన్ 26న సీబీఐ అరెస్ట్ చేసింది. అయితే ఈడీ కేసులో సీఎంకు జూలై 12న సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయగా.. సీబీఐ కేసులో ఇప్పటి వరకు బెయిల్ రాకపోవడంతో ఆయన జైలులోనే ఉన్నారు.
కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌పై తీర్పును ధర్మాసనం ఈ నెల 5వ తేదీన రిజర్వ్ చేసిన సంగతి తెలిసిందే. మద్యం కుంభకోణం కేసులో కేజ్రీవాల్‌ను ఈ ఏడాది జూన్ 26న సీబీఐ అరెస్టు చేయగా... తనను అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ ఆయన తొలుత దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. కేజ్రీవాల్ అరెస్టును హైకోర్టు సమర్థించింది. బెయిల్ ఇచ్చేందుకు నిరాకరిస్తూ ఆగస్టు 5న ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. సీబీఐ తనను అరెస్టు చేయడాన్ని సవాలు చేయడంతోపాటు బెయిల్ ఇవ్వాలని సుప్రీంకోర్టును కోరారు.

షరతులతో కూడిన బెయిల్

ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు కేజ్రీవాల్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ తీర్పు వెలువరించింది. రూ.10లక్షల పూచీకత్తు, ఇద్దరు షూరిటీలతో ఈ బెయిల్ మంజూరు చేసింది. అంతేకాదు ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లడం,అధికారికంగా సంతకాలు చేయడంతో పాటు కేసు గురించి బహిరంగ వ్యాఖ్యలు చేయొద్దని ఆదేశించింది.

గండికోటకు జలకళ

కృష్ణాజలాల తొణికిసలాట
25.5 టీఎంసీల నీటితో నిండుకుండలా రిజర్వాయర్

విశాలాంధ్ర బ్యూరో-కడప: గండికోట రిజర్వాయర్‌కు జలకళ సంతరించుకుంది. కృష్ణా జలాలతో తొణికిసలాడు తోంది. కృష్ణా జలాలతో గాలేరు-నగరి ప్రాజెక్టులో అంతర్భాగంగా నిర్మించిన ఈ రిజర్వాయర్‌లో 25.5 టీఎంసీల నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నిర్వహణలో భాగంగా ఈ మేరకు నీటిని నిలువ ఉంచే యోచనలో నీటిపారుదల శాఖాధికారులు ఉన్నారు. గండికోట రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 26.850 టీఎంసీలు కాగా 2020లో మొదటిసారి రిజర్వాయర్ నిండింది. ఇప్పుడు నాలుగేళ్ల తర్వాత 25.5 టీఎంసీల నీరు చేరుకోవడంతో నిండు కుండలా మారింది. కర్నూలు జిల్లాలోని అవుకు రిజర్వాయర్ నుంచి వరద కాలువల ద్వారా 10,900 క్యూసెక్కుల నీటి ప్రవాహంతో మైలవరంతో పాటు గండికోట ఎత్తిపోతల పథకాలకు గ్రావిటీ ద్వారా నిర్మించిన రెండు ప్రాజెక్టులకు నీటిని విడుదల చేస్తున్నారు. గండికోట నుంచి సర్వరాయ సాగర్‌కు నీరు విడుదల చేశారు. పైడిపాలెం, చిత్రావతి రిజర్వాయర్లకు ఎత్తిపోతల ద్వారా నీటిని పంపింగ్ చేస్తున్నారు. దీంతో ఆయకట్టు రైతుల్లో ఆనంద వ్యక్తమవుతోంది. గండికోటకు 2020లో కృష్ణాతో పాటు పెన్నా నీళ్లు వచ్చాయి. గత ప్రభుత్వంలో కాల్వల విస్తరణ జరిగడంతో రిజర్వాయర్ సామర్థ్యం రెండింతలైంది. సుమారు 11,000 క్యూసెక్కుల నీటి విడుదలతో 33 రోజుల్లోనే 25 టీఎంసీలకు చేరింది. అంటే వర్షాకాలంలో తక్కువ రోజుల్లో ఎక్కువ నీటిని తెచ్చేలా జరిగిన కాలువల విస్తరణతో గండికోటకు ప్రయోజనం చేకూరింది. ఆగస్టు 10న అవుకు నుంచి నీటిని విడుదల చేస్తే సెప్టెంబర్ 13వ తేదీకి ఈ మేరకు నీరు చేరింది. నీటి ప్రవాహం కొనసాగుతుండటంతో గండికోట నుంచి మైలవరానికి 2,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, 900 క్యూసెక్కులను సర్వాయి సాగర్‌కు, వెయ్యి క్యూసెక్కుల నీటిని పైడిపాలం రిజర్వాయర్‌కు, 1500 క్యూసెక్కుల నీటిని చిత్రావతి రిజర్వాయర్‌కు విడుదల చేశారు.

గండికోట జలాశయం నింపాం
మంత్రి రాంప్రసాద్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాయలసీమలో వర్షపాతం తక్కువ ఉన్నప్పటికీ ఎగువ కృష్ణ పరీవాహక ప్రాంతం నుంచి భారీగా శ్రీశైలం రిజర్వాయర్‌కు వరద నీరు రావడంతో 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న గండికోట జలాశయానికి వరద నీటిని తీసుకువచ్చి 25.5 టీఎంసీలతో నింపినట్లు రాష్ట్ర రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, జలాశయం నిర్మాణం పూర్తయిన తర్వాత పూర్తి సామర్థ్యం 26.8 టీఎంసీలు కాగా, 25.5 టీఎంసీల మేర నీటిని నిల్వ చేయడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. 2012లో పూర్తి చేసుకున్న గండికోట జలాశయం 2013-14 లో కేవలం 3 టీఎంసీల నీటితో నిండగా, అప్పటి నుంచి నేటి వరకు పెన్నా క్యాచ్‌మెంట్‌తో వచ్చిన 80 శాతం నీటి ద్వారానే గండికోట దానికి అనుబంధంగా ఉన్న మైలవరపు చిత్రావతి, పైడిపాలెం, సర్వ సాగర్, వావికొండ జలాశయాలను నింపామని, మిగిలిన 20 శాతం కృష్ణా జలాలతో నింపుతున్నామని వివరించారు. కడప జిల్లాలోని 150 చెరువులను నీటితో నింపుతామని, ప్రతి రైతుకు చివరి ఆయకట్టు వరకు నీరు అందిస్తామని తెలిపారు.

ఏచూరికి ఏఐటీయూసీ నివాళి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి ఏఐటీయూసీ రాష్ట్ర సమితి శుక్రవారం నివాళులర్పించింది. గొల్లపూడి ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ ఏచూరి మరణం వామపక్ష ఉద్యమానికి, కార్మిక ఉద్యమాలకు తీరని లోటని తెలిపారు. మార్క్సిజాన్ని ఇక్కడి పరిస్థితులకు అనుగుణంగా అన్వయించడంలోనూ, మతోన్మాదులపైనా, సామ్రాజ్యవాద శక్తులపైనా పోరాటాలు రూపొందించడంలోనూ ఏచూరి నిరంతరం కృషి చేశారని కొనియాడారు. ఎర్రజెండా ఉద్యమాలకు అంకితమై నిబద్ధత కలిగిన సిద్ధాంతకర్తగా పనిచేశారని కొనియాడారు. ఏచూరి లేని లోటు వామపక్ష పార్టీల ఐక్య ఉద్యమాలకు నష్టదాయకమన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమం నుంచి అలుపెరగని పోరాటాలు సాగించిన ధన్యజీవి ఏచూరి అని, యువ కార్యకర్తలను ప్రోత్సహించడంలో ఆయన కీలక భూమిక పోషించారని, ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్.వెంకటసుబ్బయ్య, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లంక భూములకు ఈ క్రాప్ నమోదు: కేవీవీ ప్రసాద్ డిమాండ్

విశాలాంధ్ర-చల్లపల్లి: లంక భూములకు ఈ క్రాప్ నమోదు చేసి నష్ట పరిహారం అందించాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. కృష్ణా జిల్లా చల్లపల్లి మండలం వెలివోలు శివారు చీడేపూడి లంకలో రైతు సంఘం నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా భూముల ఆన్ లైన్ జరగకపోవడంతో ఈ క్రాప్ నమోదు కావడం లేదని రైతులు తన దృష్టికి తీసుకురాగా, సమస్యపై స్థానిక తహసీల్దార్ డి.వనజాక్షితో చర్చించి పరిష్కరించవలసిందిగా కోరారు. అనంతరం ప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూములను ఇప్పటివరకు ఆన్ లైన్ చేయకపోవడం అధికారుల తప్పిదమన్నారు. లబ్ధిదారుల పేరుపై పట్టా ఉన్నప్పటికీ ఈ క్రాప్ జరగకపోవడం ఏమిటని ప్రశ్నించారు. తహసీల్దార్‌కు ఈ విషయం వివరించగా ఇక్కడ రికార్డు అంతా కరెక్టగానే ఉందని చెప్పారని, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళతానని తహసీల్దార్ హామీ ఇచ్చారని తెలిపారు. ఈ క్రాప్ నమోదు గడువు తేదీ ముగుస్తున్నందున వీలైంత త్వరగా సమస్య పరిష్కారం చేసి లంక భూములను ఈ క్రాప్ నమోదు చేసి రైతులకు నష్ట పరిహారం అందే విధంగా చూడాలని కోరారు. కమ్యూనిస్టు అగ్ర నేత చంద్ర రాజేశ్వరరావు హయాంలో పంచిన భూములను ఇప్పటి వరకు ఆన్ లైన్ చేయకపోవడంతో ఎప్పుడు వరదలు సంభవించినా ఈ రైతులకు నష్టపరిహారం అందడం లేదన్నారు. ఆరుగాలం కష్టించి సాగు చేసుకుంటున్న రైతులను ప్రకృతి వైపరీత్యాలు వెన్ను విరుస్తుంటే, అధికారుల నిర్లక్ష్యం వారిని మరింత కుంగదీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. చీడేపూడి లంకలో 137 మంది రైతుల భూములు ఆన్ లైన్ జరగలేదని, ఈ ఖరీఫ్ సీజన్‌లో నిబంధనలు సడలించి నష్ట పరిహారం చెల్లించి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కృష్ణా జిల్లా కార్యదర్శి టి.తాతయ్య, ఏపీ రైతు సంఘం రాష్ట్ర నాయకులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, గుత్తికొండ రామరావు, అట్లూరి వెంకటేశ్వరరావు, మాలెంపాటి కోటేశ్వరరావు, పెనుమత్స ప్రభాకరరావు, రాజారత్నం, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

ఏచూరి మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు
జేవీ సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర-చిత్తూరు: సీపీఎం ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి పేర్కొన్నారు. శుక్రవారం చిత్తూరులోని గాంధీ విగ్రహం వద్ద ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారాం ఏచూరి విద్యార్థి ఉద్యమం నుండి వామపక్ష భావాలు పుణికి పుచ్చుకొని ప్రతిష్ఠాత్మక జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం విద్యార్థి సంఘ నేతగా వివిధ ఉద్యమాలకు నేతృత్వం వహించారని తెలిపారు. పార్లమెంట్ సభ్యునిగా ప్రజా సమస్యలు ప్రస్తావించి... వాటి పరిష్కారానికి తోడ్పడ్డారని పేర్కొన్నారు. ఆయన మృతి దేశానికి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజన్,సహాయ కార్యదర్శి టి.జనార్ధన్, పార్టీ నేతలు మణి, విజయగౌరి, రమాదేవి చంద్రారావు, జమిలా,రఘు, కుమారి తదితరులు పాల్గొన్నారు.



వీఆర్వోల సంఘం కోటి 30 లక్షల విరాళం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీఎం సహాయ నిధికి ఆంధ్ర ప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం కోటి 30 లక్షల రూపాయల విరాళాన్ని ప్రకటించింది. శుక్రవారం సీఎం చంద్రబాబును సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు, ఉపాధ్యక్షులు మిరియాల లక్ష్మీనారాయణ తదితరులు కలిసి వరదల బాధితుల కోసం విరాళం ఇవ్వనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 వేల మంది వీఆర్వోలకు సంబంధించి ఒకరోజు బేసిక్ పే వేతనం కట్ చేసేలా సీఎంకు అంగీకార పత్రం అందజేశారు. వరద సహాయక చర్యల్లో వీఆర్వోలు పడిన శ్రమను ప్రత్యేకంగా సీఎం చంద్రబాబు ప్రస్తావించి అభినందించారు. సీఎంను కలిసిన వారిలో సంఘం కృష్ణాజిల్లా అసోసియేట్ అధ్యక్షులు శీలం నరసింహారావు, కృష్ణాజిల్లా ప్రచార కార్యదర్శి అల్లడ నళిని కుమార్ తదితరులు ఉన్నారు.

మమ్మల్ని విధుల్లోకి తీసుకోండి
సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కు విజ్ఞప్తి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గత ఐదేళ్లుగా రాష్ట్రంలో వార్డు, గ్రామ సచివాలయ వలంటీర్లు చేసిన సేవలు గుర్తించి... విధుల్లో కొనసాగించాలని ఏఐవైఎఫ్ అనుబంధిత ఆంధ్రప్రదేశ్ స్టేట్ వలంటీర్స్ అసోసియేషన్ (ఏపీఎస్‌డబ్ల్యూఏ) అధ్వర్యంలో ప్రభుత్వానికి వలంటీర్లు బహిరంగ లేఖ రాశారు. ఈ మేరకు శుక్రవారం అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు గుజ్జుల ఈశ్వరయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ పరుచూరి రాజేంద్ర, ఆర్గనైజింగ్ కార్యదర్శి లంకా గోవింద రాజులు అధ్వర్యంలో వలంటీర్లు రాసిన లేఖను మీడియాకు విడుదల చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ప్రభుత్వ పెద్దలు స్పందించి తమను విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఐదేళ్లుగా ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరవేయడంలో తాము క్రియాశీలకంగా వ్యవహరించామని గుర్తుచేశారు. కరోనా సమయంలో ప్రజలకు బాసటగా నిలిచి ప్రాణనష్టం పెరగకుండా కృషి చేశామని వివరించారు. విపత్కర పరిస్థితుల్లో, ప్రకృతి వైపరీత్యాల సమయంలో రాత్రి పగలు తేడా లేకుండా..ఆపద సమయంలో ఆపన్న హస్తం అందించామని, అలాంటి తమను మూడు నెలలుగా పనిచేయకుండా వ్యవహరించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తమను విధుల్లో కొనసాగించి ఉంటే... విజయవాడ వరద సహాయక చర్యల్లో చురుగ్గా పాల్గొనే వారమని, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు, ఆహార పంపిణీ నిర్వహించే వాళ్లమని స్పష్టంచేశారు. చిన్నపిల్లల నుంచి అవ్వా తాతల వరకు కుటుంబ సభ్యుల వివరాలతో ఎప్పటికప్పుడూ ప్రభుత్వానికి తెలియజేసి, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా వ్యవహరించే వాళ్లమని వివరించారు. నాడు నిరుద్యోగంతో వలంటీర్లుగా నియమితులమయ్యామని, ప్రజలకు ప్రభుత్వానికి తాము సేవకులమనేది గుర్తించాలని ఆ లేఖలో కోరారు.

మెగా లోక్ అదాలత్ వినియోగించుకోండి: డీజీపీ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: డీజీపీ ద్వారకా తిరుమలరావు శుక్రవారం అన్ని జిల్లాల ఎస్పీ, సీపీలతో నిర్వహించిన ప్రత్యేక టెలికాన్ఫరెన్స్‌లో మెగా లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన కేసులను సమీక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా శనివారం జరగనున్న లోక్ అదాలత్‌లలో అన్ని పోలీస్ స్టేషన్‌లలో పెండింగ్‌లో ఉన్న రాజీ పడదగిన కేసులను త్వరితగతిన పూర్తి చేసి... ఫలితాలు రాబట్టాలని ఆదేశించారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న మెగా లోక్ అదాలత్‌పై ప్రజలలో అవగాహన కల్పించాలని డీజీపీ చెప్పారు. మెగా లోక్ అదాలత్‌లో ఉత్తమ ప్రతిభ కనబరచిన వారికి ప్రత్యేక బహుమతి ఇవ్వనున్నట్లు చెప్పారు. ఏపీఎస్ఆర్టీసీలోనూ మెగా లోక్ అదాలత్‌ను వినియోగించుకొని కేసులు రాజీ చేయాలని సూచించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో అన్ని జిల్లాల ఎస్పీలతో పాటు రేంజ్ ఐజీలు, ఐజీపీ లీగల్, అదనపు డీజీపీ సీఐడీ పాల్గొన్నారు.

చిత్తూరు జిల్లాలో రోడ్డు ప్రమాదంపై జగన్ దిగ్భ్రాంతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చిత్తూరు జిల్లా మొగిలి ఘాట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ సహా అనేక మంది ప్రయాణికులు మరణించడం బాధాకరమన్నారు. చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మంచి వైద్య సదుపాయాలు అందించాలని, మృతుల కుటుంబాలను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సామాన్యుల చెంతకు విశాఖ బ్యాంక్
రేపు చిత్తూరులో కొత్త బ్రాంచ్: చలసాని

విశాలాంధ్ర-చిత్తూరు: సామాన్యుల జీవనస్థితిగతులు మెరుగుపరచాలన్న సంకల్పంతో ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ ఆవిర్భవించిందని ఆ బ్యాంక్ ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు చెప్పారు. చిత్తూరులో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన బ్యాంకు సేవల కోసం చిత్తూరులో ఆదివారం 53వ బ్రాంచ్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ 1916లో విశాఖపట్నం కేంద్రంగా ప్రారంభమై... అంచలంచెలుగా విస్తరించి... అతిపెద్ద సహకార అర్బన్ బ్యాంకుగా గుర్తింపు పొందినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 52 బ్రాంచ్‌లతో కార్యక్రమాలు కొనసాగిస్తున్నామన్నారు. ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ సహకార సూత్రాలను త్రికరణ శుద్ధితో ప్రజాస్వామ్యబద్ధంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. వాణిజ్య బ్యాంకుల నుండి ఎటువంటి తోడ్పాటు పొందలేని ప్రజలకు విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ ప్రత్యామ్నాయ బ్యాంకుగా నిలుస్తోందన్నారు. తమ బ్యాంక్ కేవలం ఆర్థిక కార్యక్రమాలకు మాత్రమే పరిమితం కాకుండా సభ్యులకు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇంటి నిర్మాణం, వ్యాపారం, విద్య, వ్యక్తిగత, బంగారు రుణాలు అందిస్తున్నామన్నారు. చిత్తూరు ప్రాంత ప్రజలకు కో-ఆపరేటివ్ సేవలు అందించాలన్న సదభిప్రాయంతో 53వ బ్రాంచ్‌ను ఇక్కడ ప్రారంభించనున్నట్లు తెలిపారు. చిత్తూరు ప్రాంతవాసులు ఈ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విలేకరుల సమావేశంలో బ్యాంక్ డైరెక్టర్లు సత్యనారాయణమూర్తి, కోటేశ్వరరావు, నారాయణస్వామి, రామకృష్ణారావు, జోనల్ మేనేజర్ శ్రీనివాసరావు, సీఈఓ వరలక్ష్మి, బ్రాంచ్ మేనేజర్ సురేశ్, సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, సీపీఐ నేత జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

కూలీల సమస్యలు విస్మరిస్తే పతనమే
పాలకులకు ఆవుల శేఖర్, వెంకట్రావు హెచ్చరిక

విశాలాంధ్ర-కడప: ఉపాధి కూలీల సమస్యలను విస్మరిస్తే పతనం తప్పదని కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలను ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, ఉప ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రావు, సీపీఐ కడప జిల్లా కార్యదర్శి గాలి చంద్ర హెచ్చరించారు. ఉపాధి చట్టానికి తూట్లు పొడుతున్న మోదీ ప్రభుత్వానికి కూలీల ఊసురు తగులక మానదన్నారు. భూ సమస్యలతో పాటు ఉపాధి హామీ సమస్యల పరిష్కారానికిగాను కడప జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని ప్రకటించారు. ప్రతి కూలీకి వంద రోజుల పని, రోజుకు రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. పనిచేసే చోట పరికరాలకు భద్రతా కల్పించాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం కడప జిల్లా సర్వసభ్య సమావేశం శుక్రవారం సీపీఐ కార్యాలయం వాచ్మెన్ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు వీరశేఖర అధ్యక్షతన జరిగింది. సమావేశంలో నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వం ఉపాధి హామీ పనులు చేపట్టినప్పటికీ బిల్లులు చెల్లించలేదని, దీంతో కూలీలు అప్పుల్లో ఉన్నారన్నారు. కొత్త ప్రభుత్వమైనా కూలీల సమస్యలు తీర్చాలని, వారికి న్యాయం చేయాలని కోరారు. కూలీల పిల్లలకు విద్య నుంచి ఉద్యోగాల వరకు ఏ ఒక్క ప్రభుత్వంలోనూ న్యాయం చేసింది లేదన్నారు. రాష్ట్రంలో భూ సమస్యలు పెరిగాయని, బడుగు బలహీన వర్గాలకు భూమి అందని ద్రాక్షగా మారిందన్నారు. మూడు సెంట్ల ఇంటి స్థలం... రెండు ఎకరాల ప్రభుత్వ భూమి కోసం... ఉద్యమాలు, పోరాటాలు జరుగుతుండటాన్ని బట్టి 76 ఏళ్లలో కూలీల బతుకులు మార లేదని స్పష్టమైందన్నారు. జిల్లాలో ప్రధానంగా గత ప్రభుత్వంలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంత మయ్యాయన్నారు. ప్రతి నియోజకవర్గంలో నాయకులు 500-1000 ఎకరాలు బినామీ పేర్లతో పట్టాలు పొంది ఎస్టేట్ నిర్మించు కున్నారని విమర్శించారు. రాబోవు రోజుల్లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో క్షేత్రస్థాయి పరిశీల నను చేపడతా మని, గ్రామస్థాయి కమిటీలు ఏర్పాటుతో సంఘాన్ని బలోపేతం చేస్తా మని, భూ పోరా టాలను పెంచుతామని నాయకులు సంక ల్పించారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్ర హ్మణ్యం, ఉప ప్రధాన కార్యదర్శి పగడపూల మల్లికార్జున, ఆఫీసు బేరర్లు షావలి సుబ్ర మణ్యం బ్రహ్మం, వేముల భాష పాల్గొన్నారు.

వంద రోజుల కార్యాచరణ వేగవంతంగా అమలు చేయాలి
సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక కింద ఆర్థికేతర, స్వల్ప కాలంలో పరిష్కరించగలిగిన అంశాలను వేగవంతంగా పూర్తి చేసేందుకు వెంటనే ఆయా శాఖలు తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదేశించారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలుపై శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో వైద్య, ఆరోగ్య, హోం, జీఏడీ, న్యాయ, దేవాదాయ ధర్మాదాయ, ప్రణాళిక, ఎక్సైజ్, జల వనరులు, మైన్స్ అండ్ జియాలజీ, ఇంధన, వ్యవసాయ, సహకార, పశుసంవర్ధక, మత్స్య, గ్రామ, వార్డు సచివాలయ, సాంఘిక, బీసీ, మైనార్టీ, ఈబీసీ, సంక్షేమం, చేనేత జౌళి శాఖలకు సంబంధించిన ప్రాధాన్యత అంశాలు, ముఖ్యంగా 100 రోజుల్లో పరిష్కరించగలిగే ఆర్థికేతరపరమైన అంశాలకు సంబంధించి సమీక్షించారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో సత్వర పరిష్కారానికి అవకాశం ఉన్న, ఆర్థికేతర అంశాలకు చెందిన వివిధ ప్రజా సమస్యలు లేదా ఇతర అంశాలను వంద రోజుల్లోగా పరిష్కరించే విధంగా తగిన చర్యలు తీసుకోవా లని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమావేశానికి వర్చువల్‌గా వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటి.కృష్ణ బాబు, హోం శాఖ ప్రత్యేక కార్యదర్శి విజయకుమార్, దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు. సమావేశంలో అనేక శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

27 వరకు మత్స్య డిప్లొమోలో ప్రవేశాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ మత్స్య విశ్వవిద్యాలయంలోని ప్రభుత్వ, అనుబంధ ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికిగాను మత్స్య డిప్లొమో కోర్సులో మిగిలిన సీట్లకు ఈనెల 27 వరకు ప్రవేశాలు కొనసాగుతాయని రిజిస్ట్రార్ ఓ.సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన తక్కువ ఆర్థిక స్తోమత గల విద్యార్థులకు ఇదొక అవకాశమని తెలిపారు. ఈ కోర్సు చదివిన విద్యార్థులు చివరి సంవత్సరంలో ఉండగానే వివిధ కంపెనీల్లో ప్లేస్‌మెంట్లు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

భాష్యం రామకృష్ణ భారీ విరాళం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వరద విపత్తుతో సర్వం కోల్పోయి నిరాశ్రయులైన బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని సీఎం చంద్రబాబు ఇచ్చిన పిలుపునకు దాతల నుండి అనూహ్య స్పందన లభిస్తోంది. వరద బాధితులను ఆదుకోవడానికి మేము సైతం అంటూ దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సీఎం సహాయ నిధికి విరాళాలు అందజేస్తున్నారు. కొంతమంది దాతలు సచివాలయంలో శుక్రవారం చంద్రబాబు నాయుడును కలిసి చెక్కులు అందజేశారు. వరద బాధితులను ఆదుకోవడానికి ముందుకొచ్చిన దాతలను సీఎం అభినందించారు. భాష్యం పేరమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ తరపున భాష్యం రామకృష్ణ రూ.4 కోట్లను విరాళంగా అందజేశారు. విరాళాలు అందజేసిన వారిలో డాక్టర్ పి.సత్యనారాయణ (ఎస్ఆర్ఎం యూనివర్సిటీ) రూ.3 కోట్లు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైస్ మిల్లర్ల అసోసియేషన్ రూ.2 కోట్లు, బెకామ్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత బొల్లినేని కృష్ణమోహన్ రూ.1.25 కోట్లు, తులసీ సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత తులసీ రామచంద్రప్రభు రూ.కోటి, మాజీ ఎంపీ, టీడీపీ నేత కంభంపాటి రామ్మోహన్‌రావు, ఎన్‌జీ రంగా యూనివర్సిటీ టీచింగ్, నాన్ టీచింగ్, రిటైర్డ్ ఉద్యోగులు, డెక్కన్ ఫైన్ కెమికల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రూ.50 లక్షలు వంతున, ఏఎస్ఎన్ ప్రసాద్(ఛైర్మన్-సప్తగిరి గ్రామీణ బ్యాంక్) రూ.32 లక్షల 49 వేలు, ఎస్.ప్రసాద రాజు, ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కన్‌స్ట్రక్షన్స్ రూ.25 లక్షలు, తణుకు మాజీ ఎమ్మెల్యే వైటీ రాజా కుమారుడు యలమర్తి అవినాశ్ రూ.20 లక్షలు, సిరి సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అరిమిల్లి వివేకానంద, చుండూరి మధుసూదనరావు రూ.10 లక్షల చొప్పున, శ్రీకాంత్ ఫ్లోర్ ఇండస్ట్రీస్ శ్రీకాంత్, కె.సాయి రోహిత్ (రామచంద్రా కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్-ఏలూరు), మీ సేవా ప్రతినిధులు రూ.5 లక్షల వంతున విరాళాలు అందజేశారు. మన్నవ సుబ్బారావు మూడు బంగారు గాజులను విరాళంగా అందించారు. హైకోర్టు ఉద్యోగులు, వీఆర్‌ఓలు ఒక రోజు వేతనాన్ని విరాళంగా ప్రకటించారు.



టీడీపీలో చేరిన జగ్గయ్యపేట మున్సిపల్ ఛైర్మన్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, వైసీపీ ఘోర పరాజయాన్ని చవిచూడటంతో రాష్ట్రవ్యాప్తంగా వివిధ నియోజకవర్గాలకు చెందిన నాయకులు పార్టీని వీడుతున్నారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో వైసీపీకి ఆ పార్టీ ప్రజాప్రతినిధులు ఝలక్ ఇచ్చారు. జగ్గయ్యపేట మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, ఆయన తండ్రి రంగాపురం నర్సింహారావు మంత్రి నారా లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరారు. వారితో పాటు 7వ వార్డు కౌన్సిలర్ పూసపాటి సీతారావమ్మ దంపతులు, 31వ వార్డు కౌన్సిలర్ గింజుపల్లి వెంకట్రావు, కుమారుడు కృష్ణ, 23వ వార్డు కౌన్సిలర్ డి.రమాదేవి దంపతులు టీడీపీలో చేరారు. ఉండవల్లి నివాసంలో వీరందరికీ నారా లోకేశ్ పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీమంత్రి నెట్టెం రఘురాం, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) తదితరులు పాల్గొన్నారు.

రూ.6.49 కోట్ల విలువైన విదేశీ సిగరెట్లు స్వాధీనం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: అక్రమంగా రవాణా చేసిన విదేశీ సిగరెట్లను కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 65లక్షల సిగరెట్లు ఉన్నాయని, వాటి విలువ రూ.6.49కోట్లు అని ఏపీ కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి తెలిపారు. విజయవాడలోని కామినేనినగర్‌లోని ఇంట్లో విదేశీ సిగరెట్లను నిల్వ ఉంచినట్లు పక్కా సమాచారం ఉండటంతో గుంటూరు కస్టమ్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మూడు గదుల్లో 649 అట్టపెట్టెలలో 3,24,967 సిగరెట్ ప్యాకెట్లు సీజ్ చేశారు. ప్యాకెట్లపై ప్యారిస్ బ్రాండ్ గుర్తులు, విదేశీ భాషలో పదాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సిగరెట్లను అక్రమంగా దిగుమతి చేసుకున్నారంటూ కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారాన్ని కస్టమ్స్ అదనపు కమిషనర్ కాకర్ల ప్రశాంత్ కుమార్ విచారిస్తున్నారు.

సంపాదకీయం

మోదీ పేరంటం చెరిపిన హద్దులు

గణపతి పూజ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హఠాత్తుగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్ర చూడ్ ఇంటికి వెళ్లారు. పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సంఘటనకు సంబంధించి చిట్టి వీడియో ఒకటి బయటకు వచ్చింది. కాదు ప్రధానమంత్రి మోదీ స్వయంగా సామాజిక మాధ్యమాల ద్వారా బట్వాడా చేశారు. ఈ ఉదంతాన్ని జనానికి తెలియజేశారు. మోదీ ఇలా చేయడం అసంకల్పితంగా జరిగింది కాదు. ఏ ప్రధానమంత్రి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఇంటికి వెళ్లిన ఉదంతం ఇప్పటిదాకా ఒక్కటీ లేదు. తన ఇంట్లో గణపతి పూజకు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ ఆహ్వానించారా లేక ప్రధానమంత్రి తనంతట తానే వచ్చారా అన్నది ఇప్పటికి తెలియదు. ప్రధానమంత్రి గానీ, ప్రధాన న్యాయమూర్తి గానీ రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారు కనక మోదీ ప్రధాన న్యాయమూర్తి ఇంటికి వెళ్లడం వారి వ్యక్తిగతమైన అంశం కాదు. ఇద్దరికీ మత విశ్వాసాలు ఉండవచ్చు. ఉన్నాయి కూడా. ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ మహారాష్ట్రీయుడు. అక్కడ గణపతి ఉత్సవాలకు లోకమాన్య బాల గంగాధర్ తిలక్ కాలం నుంచి అత్యంత ప్రాధాన్యం ఉంది. గణపతి పూజ చేయడం ఆయన మత విశ్వాసాలకు సంబంధించింది. దానికీ అభ్యంతరం లేదు. కానీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి రాజ్యాంగ పరిరక్షణ బాధ్యత ఉంది. అది ఆయన మత విశ్వాసాలకన్నా ఎన్నో రెట్లు ప్రధానమైంది. అత్యున్నత పదవిలో ఉన్న రాష్ట్రపతికి, ప్రధానమంత్రికి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి మత విశ్వాసాలు ఉండడం ఎంత మాత్రం అభ్యంతరకరం కాదు. అది వారి వ్యక్తిగత అంశం అయి ఉండొచ్చు. కానీ వారు కేవలం వ్యక్తులు కారు. రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు. వారి వ్యక్తిగత పూజా పురస్కారాలకు అభ్యంతరం లేదు కాని వాటి గురించి టముకు వేసుకోవడం, పనిగట్టుకుని వీడియోలు, ఫొటోలు ప్రచారంలో పెట్టడం మాత్రం కచ్చితంగా అభ్యంతరకరమైందే. ఇది ఒక రకంగా రాజ్యాంగ ఉల్లంఘనే. ఎందుకంటే మన రాజ్యాంగం రాజ్యవ్యవస్థలో కార్యనిర్వాహక వర్గం, చట్టసభలు, న్యాయవ్యవస్థ పరిధులు ఏమిటో కచ్చితంగా నిర్వచించింది. రాజ్య వ్యవస్థలోని ఈ ప్రధాన అంగాలు మరో విభాగం వ్యవహారాలలో జోక్యం చేసుకోకూడదని నిర్దేశించింది. అధికారాల విభజన మన రాజ్యాంగంలో స్పష్టంగా ఉంది. ఈ ఏర్పాటు చేయడానికి ప్రధాన కారణం అన్ని వ్యవస్థలు స్వతంత్రంగా పని చేయాలన్న ఉద్దేశంతోనే. అన్నింటికన్నా మించి మనది సెక్యులర్ రాజ్యవ్యవస్థ. మోదీ, ప్రధాన న్యాయమూర్తి కలుసుకున్న సంఘటన మామూలు దృష్టితో చూస్తే అంత ప్రధానమైంది కాకపోవచ్చు. కాన్నీ మోదీ, ప్రధాన న్యాయమూర్తి ఇంటికి వెళ్లడంవల్ల తప్పనిసరిగా తప్పుడు సంకేతాలే ఇస్తాయి. కింద నుంచి సుప్రీంకోర్టు దాకా విచారణకు వచ్చే కేసుల్లో ఎక్కువ భాగం ప్రభుత్వానికి సంబంధించినవే. అందుకని పాలనా విభాగాధిపతి, ప్రధాన న్యాయమూర్తి ప్రైవేటు కార్యకలాపాలు కూడా జనం చర్చించుకునే స్థాయికి దిగజార కూడదు. అలాంటి సమావేశాల మీద అనుమానాలు వ్యక్తం కాకూడదు. ఎవరి మత విశ్వాసాలైనా వారి సొంతం. వాటికి రాజ్యవ్యవస్థలో ఎలాంటి స్థానం ఉండకూడదు. కానీ మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత ఈ సంప్రదాయాన్ని పాటించిన సందర్భాలకన్నా ఉల్లంఘిస్తున్న ఉదంతాలే ఎక్కువ. అయోధ్యలో రామమందిరం సంప్రోక్షణ జరిగినప్పుడు మోదీనే పూజారి అవతారమెత్తారు. పూజారి ప్రేక్షకస్థానంలో మిగిలి పోయారు.

మోదీ ప్రధాన న్యాయమూర్తి ఇంటికి వెళ్లి వినాయకుడి పూజలో పాల్గొన్నప్పటి 29 సెకన్ల వీడియోలో మోదీ హారతి ఇస్తున్నారు. ప్రధాన న్యాయమూర్తి ఏవో మంత్రాలు చదువుతున్నట్టున్నారు. ఆయన సతీమణి గంట వాయిస్తున్నారు. ఇది జనానికి ఎలాంటి సందేశం పంపుతోందని మోదీగానీ, ప్రధాన న్యాయమూర్తిగానీ ఆలోచించినట్టు లేరు. అంతే కాదు మోదీ ప్రధాన న్యాయమూర్తి ఇంటికి కేవలం పండగ సందర్భంగా వెళ్లారా లేక ఈ వ్యవహారంలో మరో మతలబు ఏమన్నా ఉందా అన్న అనుమానాలు సహజంగానే వస్తాయి.

మోదీ ప్రధాన న్యాయమూర్తి ఇంటికి వెళ్లడం అంటే అది కేవలం వారి వ్యక్తిగత వ్యవహారం కాదు. అలా అనుకోవడానికి వీలు లేకుండా మోదీయే చేశారు. సామాజిక మాధ్యమాల మీది 29 సెకన్ల వీడియో, పది ఫొటోలు ఆయనే పెట్టారు. చంద్రచూడ్ 2022 నవంబర్ లో ప్రధాన న్యాయమూర్తి అయిన తరవాత ఉదారవాది అయిన వ్యక్తి ఆ స్థానంలోకి వచ్చారని మురిసిపోవడానికి అవకాశం వచ్చింది. ఆయన వివిధ సందర్భాలలో చేసిన వ్యాఖ్యలు, కోర్టుకు ఆవల చేసిన ప్రసంగాలలో అన్న మాటలు ఆయన రాజ్యాంగ పరిరక్షణకు బద్ధుడై ఉన్నారన్న నమ్మకం కలిగింది. ఆయన మరో రెండు నెలల్లో పదవీ విరమణ చేయాల్సి ఉంది. ఈ దశలో మోదీ ఆయన ఇంటికి వెళ్లడం అంటే అనుమానాలు కలగక మానవు. శివసేన ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి చెందిన సంజయ్ రౌత్ లాంటి వారైతే రాజ్యాంగ సౌధానికి ఇంటి దీపాలే అగ్గి పెట్టాయి అని తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. కపిల్ సిబల్ ప్రస్తుతం సుప్రీంకోర్టు న్యాయవాదుల సంఘానికి అధ్యక్షులు. కానీ ఆ హోదాలో కాకుండా వ్యక్తిగత హోదాలో మోదీ ప్రధాన న్యాయమూర్తి ఇంటికి వెళ్లడాన్ని ఆక్షేపించారు. నవంబర్ లోగా మహా రాష్ట్ర శాసన సభ ఎన్నికలు జరగాల్సి ఉన్నాయి. అక్కడ ఇంతకు ముందు ఉద్ధవ్ ఠాక్రే ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బీజేపీ ప్రోద్బలం వల్ల శివసేన రెండు ముక్కలైంది. అలాగే శరద్ పవార్ నాయకత్వంలోని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీనీ బీజేపీ చీల్చగలిగింది. ఈ వ్యవహారం ఇంకా సుప్రీంకోర్టు విచారణలో ఉంది. కానీ విచారణ సత్వరం జరగడం లేదు. వాయిదాల మీద వాయిదాలు వేస్తున్నారు. శాసనసభ ఎన్నికలు పూర్తి అయిన తరవాత తీర్పు వచ్చినా పరిస్థితి చక్కబడేది ఏమీ ఉండదు. బెంగాల్‌లో ఒక వైద్యురాలి మీద అత్యాచారం జరిగితే సుప్రీంకోర్టు తనంత తాను చొరవ చూపి కేసు విచారణకు స్వీకరించింది. మహా రాష్ట్ర ప్రభుత్వం పడిపోయినప్పుడు అప్పుడు గవర్నరుగా ఉన్న కోషియారీ వ్యవహార సరళినీ తీవ్రంగానే పరిగణించింది. ఇప్పుడు మాత్రం విచారణ వాయిదాలకే పరిమితం అయింది. ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ ఉదార వాది అన్న భావన ఉండడమే కాక తండ్రి తీర్పును సైతం తిరగదోడిన సాహసి అన్న అభిప్రాయం ఉంది. కానీ మోదీని తన ఇంట్లోకి ఆహ్వానించడం కేవలం మహారాష్ట్ర రాజకీయాల దృష్టినుంచి చూసినా అనుమానాలే మిగుల్తున్నాయి. కార్య నిర్వాహక వర్గానికి న్యాయవ్యవస్థ దూరంగా ఉండాలన్న విభజన రేఖ వినాయక పూజల సందర్భంగా జరిగిన సంఘటనల ద్వారా నామ రూపాలు లేకుండా చెరిగి పోయింది. సుప్రీంకోర్టులో ఏ న్యాయమూర్తి విచారించాలో నిర్ణయించే అధికారం ప్రధాన న్యాయమూర్తి చేతిలో ఉంటుంది. ఈ విషయమై నలుగురు సుప్రీంకోర్టు న్యాయ మూర్తులు 2018లో విలేకరుల సమావేశం నిర్వహించి ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికి కేసుల విచారణా విధులను కేటాయించడంలో వివక్ష ఉందన్న ఆరోపణలు సమసి పోనేలేదు. గణపతి పూజ సందర్భంగా జరిగిన సంఘటన అధికార విభజన సూత్రాన్ని బాహాటంగా ఉల్లంఘిస్తున్నారన్న విమర్శలకు దారి తీస్తోంది.

సేంద్రియ కర్బనంతో వ్యవసాయం మనుగడ

డా. ముచ్చుకోట సురేష్ బాబు

వ్యవసాయ నేలల్లో సేంద్రియ కర్బనం స్థాయిలను పెంచడంవల్ల వాతావరణ కార్బన్ డై ఆక్సైడ్‌ను సీక్వెస్టర్ చేయడంలో సహాయపడుతుంది. మొక్కలు కిరణజన్య సంయోగక్రియ సమయంలో కార్బన్ డై ఆక్సైడ్‌ని గ్రహించి, దానిని సేంద్రీయ పదార్థంగా మారుస్తాయి, ఇది కుళ్ళిన తర్వాత మట్టిలో కలిసిపోతుంది. నేలలో సేంద్రియ పదార్థాలు పెంపొందించే పద్ధతులను అవలంబించడం, కవర్ పంటలు, పంట మార్పిడి, పప్పు ధాన్యాల పంటలు పెంచడం, కంపోస్ట్ లేదా పేడ వంటి సేంద్రీయ కర్బనం జోడించడం ద్వారా, రైతులు కార్బన్ పెంచడానికి దోహదపడవచ్చు. వాతావరణ మార్పులను తగ్గించడం, నేల ఆరోగ్యం, సంతానోత్పత్తికి సేంద్రియ కర్బనం ఒక ముఖ్యమైన భాగం. ఇది నేల నిర్మాణం, నీటిని నిలుపుకునే సామర్థ్యం, పోషకాల లభ్యతను, సూక్ష్మజీవుల కార్యకలాపాలను మెరుగుపరుస్తుంది. అధిక సేంద్రియ కర్బనం ఉన్న ఆరోగ్యకరమైన



నేలలు కరువు, భారీ వర్షపాతం వంటి తీవ్రమైన వాతావరణ పరిస్థితులను తట్టుకుంటాయి. నేలలో తేమను బాగా నిలుపుకుంటాయి. పోషకాల లీచింగ్‌ను తట్టుకోగలవు. ఇది క్రమంగా పంట ఉత్పాదకతను కొనసాగించడంలో సహాయపడుతుంది. తద్వారా వాతావరణ వైవిధ్యానికి హానిని తగ్గిస్తుంది. అధిక సేంద్రియ కర్బనం స్థాయిలు కలిగిన నేలలు మెరుగైన నిర్మాణం, స్థిరత్వాన్ని కలిగి ఉంటాయి, ఇది గాలి నీటి ద్వారా నేల కోతను తగ్గిస్తుంది. సేంద్రీయ పదార్థం ఒక బైండర్‌గా పనిచేస్తుంది, నేల కణాలను ఒకదానితో ఒకటి పట్టుకొని వాటి నిర్లిప్తత, రవాణాను నిరోధిస్తుంది.

సేంద్రియ కర్బనం రూట్ జోన్‌లో పోషకాలను నిలుపుకోవడంలో సహాయపడుతుంది. పోషకాల ప్రవాహాన్ని తగ్గిస్తుంది. మొక్కల పోషక-వినియోగ సామర్థ్యాన్ని పెంచుతుంది. నీటి వనరుల పోషక కాలుష్యానికి గురయ్యే ప్రాంతాలలో ఇది చాలా ముఖ్యమైనది. గత డెబ్బై సంవత్సరాల క్రిందట వ్యవసాయ భూములలో 1 శాతం ఉన్న సేంద్రియ కర్బనం ఇప్పుడు డెబ్బై శాతం క్షీణతతో 0.3 శాతానికి దిగజారింది. భూములలో సేంద్రియ కర్బనం పెంచకపోతే ప్రపంచ ఆహార భద్రతకు పోషకాహారానికి రానున్నకాలంలో పెనుముప్పు పొంచివుంది. "అధిక సేంద్రీయ కార్బన్ కంటెంట్ ఉన్న నేలలు మరింత సారవంతమైన ఉత్పాదకతను కలిగి ఉంటాయి. మంచి నీటిని శుద్ధి చేయగలవు. వాతావరణ మార్పుల ప్రభావాలకు జీవనోపాధి స్థితిస్థాపకతను పెంచడంలో సహాయపడతాయి". ఐక్యరాజ్య సమితి 2030 ఎజెండా స్థాపించిన అనేక అంతర్జాతీయ అభివృద్ధి లక్ష్యాలను, ముఖ్యంగా ఆకలి,పోషకాహార లోపాన్ని నిర్మూలించే రెండవ లక్ష్యం సాధించడానికి నేలల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం,వాటి సేంద్రీయ కార్బన్ కంటెంట్‌ను పెంచడం చాలా కీలకమని పేర్కొంది.

హాని కలిగించే వనరు వాతావరణం నుండి మొక్కలు లేదా సేంద్రియ అవశేషాల ద్వారా "స్థిరపరచిన" తర్వాత కార్బన్ భూగర్భంలో వేరు చేయడమవుతుంది. తర్వాత చాలావరకు సహజ ప్రక్రియల ద్వారా నేలల్లో కలిసిపోతుంది. నేల కార్బన్ కంటెంట్‌లో జీవించి ఉన్న అలాగే చనిపోయిన భాగాలను కలిగి ఉంటుంది. కానీ మట్టి చెదిరిపోయినప్పుడు లేదా క్షీణించినప్పుడు, చిక్కుకున్న కార్బన్ క్షయం ఫలితంగా ఏర్పడే ఇతర గ్రీన్‌హౌస్ వాయువులు మళ్లీ వాతావరణంలోకి విడుదల చేయడంతో నేల కార్బన్ రిజర్వాయర్ వాతావరణంలోకి భారీ మొత్తంలో గ్రీన్‌హౌస్ వాయువులను విడుదల చేయగలదు. గ్రహం యొక్క మూడింట ఒక వంతు నేలలు క్షీణించాయి, ఇది ప్రపంచ నేల సేంద్రియ కార్బన్ నిల్వలలో అపారమైన తగ్గుదలకు దారితీస్తుంది. వాతావరణంలోకి 100 గిగాటన్నుల వరకు విడుదలైంది. పేలవమైన నేల నిర్వహణ ద్వారా నేల కార్బన్ నిల్వలకు మరింత నష్టం జరగడం ప్రపంచ ఉష్ణోగ్రతల పెరుగుదలను పరిమితం చేసే ప్రయత్నాలకు ఆటంకం కలిగిస్తుంది. పెరిగిన ప్రకృతి వైపరీత్యాలు, వరదలు, కరువులు ఇతర వాతావరణ మార్పు ప్రభావాలను నివారించవచ్చు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు విపరీతమైన వాతావరణ సంఘటనల పౌనఃపున్యం మట్టి సేంద్రీయ కార్బన్ అదనపు నష్టాలకు దారి తీస్తుంది.

సెల్: 9989988912

అడకత్తెరలో నితీశ్

అరుణ్ శ్రీవత్సవ

బీహార్ ముఖ్యమంత్రి పరిస్థితి అడకత్తెరలో పోకచక్కలాగా ఉంది. రాష్ట్ర రాజకీయాలపైన ఆయనకు రోజురోజుకూ పట్టుతగ్గుతోంది. ప్రజాదరణ సన్నగిల్లుతోంది. మరోవైపు బీజేపీ నాయకత్వం నితీశ్ తనంతటతానుగా అసంబద్ధంగా తయారయ్యేవరకు వేచిచూద్దామని భావిస్తున్నారు. కొన్ని నెలల క్రితం జనాదరణ మేలుగా ఉండగా ఇటీవల క్రమంగా నితీశ్ పలుకుబడి తగ్గుతోంది. ఆయన పరిస్థితిపై ప్రజలు పాపభీతి చూపిస్తున్నారు. ఆయన తరచుగా పార్టీలు మారుతున్న పరిస్థితిని గమనించిన ప్రజలు ఆయనపై వ్యతిరేకతను పెంచుకుంటున్నారు. దయ్యాలతోనైనా కలిసి అధికారాన్ని నిలుపుకోవాలనేది నితీశ్ ప్రధాన లక్షణంగా కనిపిస్తోంది. ఇటీవలికాలంలో నరేంద్ర మోదీ, అమిత్ షాలు ఆయనను అవమానించడమే ఆయన పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. మోదీ మూడవసారి ప్రధానమంత్రిగా ప్రభుత్వాన్ని అటు నితీశ్, ఇటు చంద్రబాబు నాయుడు సహకారంతో నడుపుతున్నారు. బీహార్‌కు ప్రత్యేకహోదా ఇవ్వాలని నితీశ్ చేసిన ఒత్తిడిపై అందుకు సానుకూలంగా వ్యవహరించినట్లు కనిపించింది. అలాగే ప్రత్యేక ఆర్థికప్యాకేజీని కూడా ప్రకటించి అవసరమైన నిధులను ఇవ్వాలని కూడా నితీశ్ కోరారు. అయితే కొన్ని కూలిపోయిన బ్రిడ్జీలు తిరిగి నిర్మించడానికి మరికొన్ని డిమాండ్లకు సానుకూలత చూపి వాటికి నిధులను అందిస్తామని మోదీ ప్రకటించారు. నితీశ్ కోరినట్లుగా అవసరమైన సహాయాన్ని మోదీ ప్రభుత్వం ఇవ్వలేదు. తమ పార్టీ ఎంపీ లలన్‌సింగ్‌కు మంత్రి పదవిని మోదీ ఇచ్చారు. అంతకు మినహా ఎటువంటి సహాయాన్ని లేదా మరొక ఎంపీకి పదవి ఏమీ ఇవ్వలేదు. తన చొరవతోనే లలన్‌సింగ్‌కు మంత్రిపదవి ఇచ్చారని నితీశ్ ప్రకటించారు. అయితే అమిత్ షా రూపొందించుకున్న వ్యూహంతోనే లలన్‌సింగ్‌ను మంత్రిగా చేశారు.

నితీశ్‌ని తక్కువగాచూస్తూ మంత్రివర్గంలోకి లలన్‌సింగ్‌ను తీసుకున్నారని అర్థమైపోయింది. నెలరోజుల క్రితం నితీశ్ మళ్లీ మరోపార్టీకి సానుకూలంగా మారాలని ఆలోచించారు. ఆ ప్రయత్నం నెరవేరలేదు. జేడీ(యూ) కుచెందిన 12 మంది ఎంపీలు మోదీ-షాలకు తమ తోడ్పాటును అందిస్తామని ప్రతిజ్ఞచేశారు. ఈపరిణామం నితీశ్‌కి విభ్రాంతి కలిగించింది. దీనితో ఆయన నిరాశపడ్డారు. మోదీ ప్రభుత్వం నుంచి తప్పుకోవాలని ఆలోచించారుగానీ అది సమస్యగా మారవచ్చునని భావించారు. మరొక పార్టీకి అనుకూలంగా మోదీ ప్రభుత్వం నుంచి బైటకువస్తే నితీశ్ తీవ్రంగా నష్టపోయేవారు. తన ఆలోచనలకు ఒక వ్యూహాన్ని రచించుకుని ఆర్‌జేడీ నాయకుడు లాలూప్రసాద్ యాదవ్ గతంలో ఉపముఖ్యమంత్రిగా పనిచేసిన తేజస్వియాదవ్‌లను నితీశ్ కలుసుకున్నారు. అయితే మారనున్న రాజకీయ పరిస్థితులను అర్థం చేసుకుని మోదీ ప్రభుత్వం నుంచి వెలుపలికిరాకుండా సంయమనం పాటించారు. నితీశ్‌కుమార్ విశ్వసనీయతను తేజస్వియాదవ్ ప్రశ్నించారు. నితీశ్ చేసిన వాగ్దానాలకు విలువలేకుండా పోయిందన్నారు. ప్రజల విశ్వసనీయత దెబ్బతినిందని తేజస్వి యాదవ్ అన్నారు. బీజేపీ నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వంలో చేరాలని ఎంఎల్‌ఏలు భావించారు. అయితే తాను తీసుకున్న నిర్ణయం సరిగాలేదని ఇకపై ఎంఎల్‌ఏలంతా తనకు అనుకూలంగా ఉండాలని తాను చేసిన పొరపాటుకు క్షమించాలని చేతులెత్తి కోరారు. భవిష్యత్తులో ఆర్‌జేడీ నితీశ్‌కుమార్ నాయకత్వంలోని జేడీయూల మధ్య పొత్తుపెట్టుకునేందుకు తేజస్వి గట్టిగా నిరాకరించారు.

> ఇటీవల క్రమంగా నితీశ్ పలుకుబడి తగ్గుతోంది. ఆయన పరిస్థితిపై ప్రజలు పాపభీతి చూపిస్తున్నారు. ఆయన తరచుగా పార్టీలు మారుతున్న పరిస్థితిని గమనించిన ప్రజలు ఆయనపై వ్యతిరేకతను పెంచుకుంటున్నారు. దయ్యాలతోనైనా కలిసి అధికారాన్ని నిలుపుకోవాలనేది నితీశ్ ప్రధాన లక్షణంగా కనిపిస్తోంది. ఇటీవలికాలంలో నరేంద్ర మోదీ, అమిత్ షాలు ఆయనను అవమానించడమే ఆయన పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. మోదీ మూడవసారి ప్రధానమంత్రిగా ప్రభుత్వాన్ని అటు నితీశ్ , ఇటు చంద్రబాబు నాయుడు సహకారంతో నడుపుతున్నారు.

నిన్న మొన్నటి వరకు నితీశ్‌ని బాబాయ్ అని పిలిచిన తేజస్వియాదవ్ చాలా ఇబ్బందికరమైన వ్యాఖ్యానం చేశారు. నితీశ్‌కి భారీగా ప్రజల విశ్వసనీయత తగ్గిపోయింది. నితీశ్ వాగ్దానానికి ఎటువంటి విలువ లేదని, ఆయనను నమ్మేవారులేరని ఆయన ఆలోచన ఎప్పుడుఎటు మారుతుందో తెలియకుండా ఉందని తేజస్వి యాదవ్ అన్నారు. రెండుసార్లు ఆయనపట్ల దయచూపి ఆయనకు అవకాశం కల్పించామని అయినప్పటికీ ఆయన విశ్వసనీయత కోల్పోయేలాగా వ్యవహరించారని తేజస్వి అన్నారు. మరొకసారి సానుభూతి చూపించడంలో అర్థం ఉండదని తేజస్వి అన్నారు. పదేపదే రాజకీయపొత్తులను మార్చే ధోరణి ఆయనకు అలవడిందని ఆయన చెప్పేమాటలు విశ్వసించడానికి లేదని చెప్పారు. గతంలో నితీశ్ ముఖ్యమంత్రి కావడానికి ఆర్‌జేడీ చాలాసార్లు అవకాశం ఇచ్చిందని అయితే నితీశ్ తన అసలు రూపాన్ని బైటపెట్టుకున్నారని తేజస్వి అన్నారు. ప్రజలు ఆయన మాటలను నమ్మేస్థితి ఎప్పుడో కోల్పోయారని తెలిపారు.

2024 సెప్టెంబరు 6వ తేదీన కేంద్ర ఆరోగ్యమంత్రి జేపీ నడ్డాతో కలిసి కూర్చుని ఆర్‌జేడీతో తిరిగి పనిచేసే అవకాశం లేదని, ఇదంతా ఊహాజనితమేనని నితీశ్ అన్నారు. రెండుసార్లు బీజేపీతో కలిసి తప్పు చేశారని భవిష్యత్తులో తిరిగి అలాంటి తప్పుచేయబోనని కూడా నితీశ్ అంటున్నారు. అయితే ఆయన చెప్పేవాటిని రాజకీయ విశ్లేషకులు ఎంతమాత్రం విశ్వసించడంలేదు. వాస్తవంగా నితీశ్ రాష్ట్రప్రభుత్వ యంత్రాంగంపైన, పోలీసులపైన నితీశ్ కు అసలు నియంత్రణేలేదు. రాష్ట్ర రాజధాని పాట్నాలో ఊహించని సంఘటనలు జరిగి అది హింసాత్మకంగా మారింది. సెప్టెంబరు 9వ తేదీన రాష్ట్రంలో శాంతి భద్రతలు దిగజారిపోయాయని, నేరస్థులు రాష్ట్రంపై పట్టుసంపాదించారని తేజస్వి అన్నారు. చోరీలు, కిడ్నాప్‌లు సర్వసాధారణమయ్యాయన్నారు. 15 ఏళ్ల క్రితం లలూ యాదవ్ హయాంలో ఆయనది ఆటవిక పాలనగా(జంగిల్ రాజ్) నితీశ్ వ్యాఖ్యానించారు. అయితే ఇప్పుడు నితీశ్ ను ప్రజలు 'సుశాన్ బాబు' గా పిలుస్తున్నారు. రాజకీయాలలో పొందిన పలుకుబడి అంతా మట్టికొట్టుకుపోయింది. ఆయన పాలనాకాలం ముగిసిపోయినట్లేనని తేజస్వియాదవ్ వ్యాఖ్యానించారు.

సోషలిజం వైపు యువత

సత్య

అక్కడేమీ ప్రభావితం చేసే విధంగా కమ్యూనిస్టు పార్టీ లేదు, పురోగామి ఉద్యమాలూ లేవు. వాటి పట్ల వ్యతిరేకత ఉన్న పాలకవర్గం, మీడియాదే ఆధిపత్యం. కమ్యూనిస్టులు కూడా కొన్ని పత్రికలు, వెబ్‌సైట్లు నడుపుతున్నప్పటికీ వాటి ప్రభావం పరిమితమే. అయినా ఆస్ట్రేలియాలో యువత సోషలిజం పట్ల సానుకూలత చూపుతున్నట్లు తాజా సర్వే వెల్లడించింది. అభివృద్ధి చెందిన దేశాలన్నింటా జనం ప్రత్యేకించి యువత పెట్టుబడిదారీ వ్యవస్థపట్ల విముఖత చూపుతున్నారు. 2024 జూన్ 24న యు గవ్ అనే సంస్థ ఆస్ట్రేలియాలో జరిపిన సర్వేలో 18-24 ఏండ్ల మధ్య యువతలో 53శాతం మంది సోషలిజం పట్ల సానుకూలత చూపగా తటస్థంగా 25శాతం, పెట్టుబడిదారీ వ్యవస్థకు అనుకూలత వెల్లడించిన వారు 22శాతం ఉన్నట్లు తేలింది. అదే మొత్తం అన్ని వయసుల వారిలో అలాంటి అభిప్రాయాలు వెల్లడించిన వారు 27-42-31శాతం ఉన్నారు. 2019 అక్టోబరులో యుగవ్ ప్రశ్నలకు 28శాతం మంది ఆస్ట్రేలియన్లు తమకు సోషలిజం అంటే ఏమిటో తెలియదని చెప్పగా 13శాతం మంది ఆ వ్యవస్థ కలుపుగోలుతనంతో ఉంటుందని చెప్పారు. సోషలిజాన్ని నిర్వచించమని అడిగిన ప్రశ్నకు అమెరికా యువత 60శాతం మంది సరైన సమాధానం చెప్పగా ఆస్ట్రేలియన్లు 30శాతమే ఉన్నారు. అలాంటి యువత 2024లో 53శాతం మంది సానుకూలత చూపటాన్ని గమనించాలి. సోషలిజం అంటేనే అణచివేత అని భావించిన స్థితి నుంచి బయటపడి "సోషలిజం" తాము జీవిస్తున్న పెట్టుబడిదారీ వ్యవస్థ కంటే మెరుగ్గా ఉంటుందనే అభిప్రాయం. వీరి శాతం ఏటేటా పెరుగుతున్నది. యుగవ్ 2019 అక్టోబరులో "కమ్యూనిజం బాధితులు" పేరుతో ఏర్పడిన ఒక సంస్థ తరఫున అమెరికా, ఆస్ట్రేలియాల్లో సర్వే చేసింది. యువతలో సోషలిజం అంటే సమ్మతి లేదా ఆదరణ పెరుగుతున్నదని ఆ సర్వేలో తేలింది. సోషలిజంలో అణచివేస్తారు, భావ ప్రకటన స్వేచ్ఛ ఉండదు, భవిష్యత్ లేదు, అది విఫలమైంది అని ప్రచారం పెద్ద ఎత్తున జరుపుతున్న తరుణంలోనే ఈ వ్యాఖ్యలను గమనించాలి. ప్రచ్ఛన్న యుద్ధం పేరుతో కమ్యూనిస్టు వ్యతిరేకతను పెద్ద ఎత్తున రెచ్చగొట్టిన పరిణామాలను చూసిన పాతతరం వారిలో ఉన్న వ్యతిరేక భావం యువతరంలో లేదని ఆ సర్వేలో తేలింది. ఇప్పుడు కమ్యూనిజానికి వ్యతిరేకంగా తక్కువ ప్రచారం జరుగుతోందా ? కానే కాదు, ఏ మాత్రం తగ్గలేదు.

తాజా సర్వేలో యువత సోషలిజం గురించి అధ్యయనం చేయటంతో పాటు నయా ఫాసిస్టు, మితవాద శక్తులు తమ సమస్యలకు పరిష్కారం చూపగలవేమో అన్న భ్రమలతో అటువైపు కూడా మొగ్గుతున్నారు. ఫ్రాన్సులో, జర్మనీలోని తూర్పు ప్రాంతంలో జరిగిన ఒక రాష్ట్ర ఎన్నికల్లో పచ్చిమితవాదులు పెద్దపార్టీగా అవతరించారు. జీవన ఖర్చు పెరగటం, గృహ సంక్షోభం ఆస్ట్రేలియన్ యువతను సోషలిజం గురించి ఆలోచింప చేస్తున్నదని తేలింది. జనాభాలో 18-34 ఏండ్ల వయసు వారిలో 41శాతం మంది సోషలిజాన్ని సమర్థించగా, 35కు పైబడిన వారిలో 21శాతం మంది ఉన్నారు. అదే వయసులో ఉన్నవారు పెట్టుబడిదారీ విధానాన్ని 34శాతమే సమర్థించారు. యువత సోషలిజం వైపు ఎందుకు మొగ్గుతున్నారన్న ప్రశ్నకు యుగవ్ డైరెక్టర్ పాల్ స్మిత్ మాట్లాడుతూ యువతరం ఎంతో భిన్నమైన ఆర్థిక పరిస్థితిని చవిచూస్తున్నారని, 2008 సంక్షోభం తరువాత శ్రామికశక్తిలో చేరిన యువత అసంతృప్తికిలోనై సోషలిజం వైపు మొగ్గుతున్నట్లు చెప్పాడు. స్థిరమైన ఉపాధి లేకపోవటం, తాత్కాలిక పనివారిని తీసుకొనే వాతావరణం ఎక్కువగా ఉండటంతో వారసత్వంగా వచ్చినవి ఉంటే తప్ప అద్దె ఇండ్లలో నివసించలేని స్థితి ఏర్పడింది. ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయి. గాజా వంటి చోట్ల జరుగుతున్న దారుణాలను సామాజిక మాధ్యమాల్లో చూస్తున్నవారు పెట్టుబడిదారీ విధానం యుద్ధాలను ప్రోత్సహించటం ఎందుకని ప్రశ్నలు సంధించటం పెరిగింది. ఆస్ట్రేలియాలో పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరుకొనే వారు 64శాతం మంది సోషలిజాన్ని అభిమానించగా, లేబర్ పార్టీ 31, సంకీర్ణ కూటమి మద్దతుదార్లలో కేవలం 12శాతమే ఉన్నారు. కార్పొరేట్ల లాభాల కంటే జనం ప్రయోజనాలు, భూగోళాన్ని పరిరక్షించాలని కోరుకొనేవారు పెరుగుతున్నారు.

యువతలో ఎందుకీ మార్పు ? కమ్యూనిజం విఫలమైందని ప్రచారం జరిగిన చోటే పెట్టుబడిదారీ విఫలమైందని ఆ విధాన గట్టి సమర్ధకుడైన థామస్ పికెట్టి వంటి వారు సాధికారికంగా స్పష్టం చేసిన తరువాత యువత ఆలోచించకుండా ఎలా ఉంటుంది ? సోషలిస్టు చైనా, వియత్నాం నుంచి దిగుమతి చేసుకున్న వస్తువులనే నిత్యం వాడుతున్నపుడు ఆ వస్తువులను మన దేశంలో ఎందుకు తయారు చేసుకోలేకపోతున్నాం అని ఎక్కడికక్కడ యువత అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పేవారు లేరు. 1995-2010 మధ్య జన్మించిన వారిని జడ్ తరం అని పిలుస్తున్నారు. వీరిని సోషలిజం(ఆకర్షిస్తున్నదని) కొందరు వర్ణించారు. ముఖ్యంగా అమెరికాలో ఈ ధోరణి కనిపిస్తోంది. అనేక మంది మేం సోషలిస్టులం అంటూ గర్వంగా చెప్పుకుంటున్నారు. అయితే అక్కడ దిగజారుతున్న ఆర్థిక పరిస్థితులు యువతను ఆలోచింపచేస్తున్నాయి. కమ్యూనిజం, సోషలిజం గురించి వక్రీకరణలు కొనసాగుతున్నప్పటికీ టీచర్లు బోధిస్తున్న అంశాలలో డెన్మార్క్, నార్వే వంటి చోట్ల స్కాండినేవియన్ సోషలిజం గురించి చెబుతున్న అంశాలు వారిని ఆకర్షిస్తున్నాయి. అమెరికా కంటే అక్కడి పరిస్థితి మెరుగ్గా ఉన్నందున అలాంటి సోషలిజాన్ని ఎందుకు అమలు చేయకూడదనే ప్రశ్నకు సరైన సమాధానం వారికి దొరకటం లేదు. అయితే ఆ దేశాల్లో ఉన్న జనాభా మొత్తం కూడా అమెరికాలో ఒక రాష్ట్రంలో ఉన్నవారికి సమానమని 30 కోట్ల మందికి సోషలిజాన్ని అమలు చేయటం, దీర్ఘకాలం కొనసాగించటం సాధ్యం కాదని మాత్రమే చెప్పటం వారికి సంతృప్తిని కలిగించటం లేదు. చైనాలో సంస్కరణల పేరుతో అమలు చేస్తున్నది అమెరికాలో మాదిరి పెట్టుబడిదారీ విధానమే అని నమ్మించేందుకు అక్కడి మేధావులు ప్రయత్నించారు. అదేగనుక వాస్తవమైతే మిగతా జర్మనీ,బ్రిటన్, జపాన్ వంటి దేశాలతో మిత్ర సంబంధాలను కొనసాగిస్తూ చైనాను వ్యవస్థాపరమైన శత్రువుగా మరోవైపు పాలకవర్గం చూడటాన్ని యువతరం గమనిస్తున్నది. సోషలిజం గురించి ఆసక్తి కనపరుస్తున్న యువతను దారి మళ్లించేందుకు అక్కడి కమ్యూనిస్టు వ్యతిరేకులు నానా పాట్లు పడుతున్నారు.

అంబరాన్నంటిన 'ఆప్' సంబరాలు

బీజేపీ దేశానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్

న్యూదిల్లీ: దిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించి సీబీఐ దాఖలు చేసిన అవినీతి కేసులో దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిన నేపథ్యం లో ఆప్ ప్రధాన కార్యాలయం వెలుపల సంబ రాలు అంబరాన్నంటాయి. అనేకమంది ఆప్ నాయకులు, కార్యకర్తలు పార్టీ ప్రధాన కార్యాలయం వెలుపల తమ పార్టీ అధినేత విడుదల సందర్భంగా మిఠాయిలు పంచి...బాణాసంచా కాలుస్తూ ఆనందం వ్యక్తం చేశారు. కాగా ముఖ్యమంత్రి నివాసం వెలుపల కేజ్రీవాల్ సతీమణి సునీత సహా సీనియర్ ఆప్ నాయకులు, కార్యకర్తలతో పాటు, పార్టీ మద్దతుదారులు మిఠాయిలు పంచుతూ హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. "ఆ గయే భాయ్ ఆ గయే, కేజ్రీవాల్ ఆ గయే", "జైల్ కే తాలే టూట్ గయే, కేజ్రీవాల్ చూట్ గయే" అంటూ నినదించారు. ఆప్ సీనియర్ నేతలు మనీశ్ సిసోడియా, అతిశి, సంజయ్ సింగ్, ఆయన భార్య అనిత కూడా ఉన్నారు. ఆప్ ప్రధాన కార్యాలయం వెలుపల అనేకమంది కార్యకర్తలు డోళ్లు వాయిస్తూ... నృత్యం చేస్తూ కనిపించారు. దిల్లీ మంత్రులు సౌరభ్ భరద్వాజ్, గోపాల్‌రాయ్ కూడా వేడుకల్లో పాల్గొన్నారు. కేజ్రీవాల్‌కు బెయిల్ లభించడాన్ని 'మా పార్టీకి అతి పెద్ద విజయం...నియంతృత్వానికి ఓటమి' అని గోపాల్‌రాయ్ అభివర్ణించారు. కాగా నిజాయితీగల నేత అరవింద్ కేజ్రీవాల్‌ను జైల్లో ఉంచినందుకు దేశానికి బీజేపీ క్షమాపణలు చెప్పాలని ఆప్ డిమాండ్ చేసింది.

బీజేపీ కుట్రలు విఫలం: సునీతా కేజ్రీవాల్

ఈ సందర్భంగా సునీతా కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడుతూ... 'బీజేపీ కుట్రలు విఫలమయ్యాయి. వారు అధికారంలో ఉండటానికి ప్రతిపక్ష నాయకులను కటకటాల వెనక్కి నెట్టాలనుకున్నారు' అన్నారు. 'ఆప్ కుటుంబానికి అభినందనలు...ఇంతకాలం దృఢ వైఖరి ప్రదర్శించినందుకు ధన్యవాదాలు. ఇతర నేతలు కూడా త్వరగా విడుదల కావాలని కోరుకుంటున్నాను' అన్నారు.

- అరవింద్ కేజ్రీవాల్ కు బెయిల్ లభించడంపై ఆప్ హర్షం వ్యక్తం చేసింది. సత్యమేవజయతే అంటూ ఎక్స్ వేదికగా స్పందించింది. 'నిజానికి సమస్యలు ఎదురవ్వొచ్చు. కానీ ఓడిపోదు' అని ఆప్ నేత ఆతిశీ వ్యాఖ్యానించారు.
- అసత్యాలు, కుట్రలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో సత్యం మళ్లీ గెలిచిందని దిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా అన్నారు. అరవింద్ కేజ్రీవాల్ వంటి నిజాయతీపరుడు, దేశభక్తుడు మరొకరు లేరని రుజువైందన్నారు. ఆయన్ను అరెస్టు చేసేందుకు బీజేపీ ఎన్నో కుట్రలు చేసింది. ప్రజాస్వామ్య చరిత్రలో ఇంతకంటే పాపం ఇంకోటి లేదు. ఈ రోజు నేను సుప్రీంకోర్టు, రాజ్యాంగం, బాబా సాహెబ్ అంబేద్కర్‌కు సెల్యూట్ చేస్తున్నానన్నారు. ఈడీ కేసులో కేజ్రీవాల్ విడుదలను అడ్డుకోవడానికి సీబీఐ అరెస్టు చేసిందని సుప్రీంకోర్టుకు అర్థమైంది. ప్రజల ప్రార్థనలకు నేడు సమాధానం లభించిందని పేర్కొన్నారు.
- ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా మాట్లాడుతూ... ఆప్ మరింత బలం పుంజుకుంటుంది. ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా. అరవింద్ కేజ్రీవాల్‌కు స్వాగతం. సుప్రీంకోర్టు తీర్పుకాపీని పూర్తిగా చదివిన తర్వాత మా తదుపరి వ్యూహాన్ని సిద్ధం చేసుకుంటాం. దేశంలో, దిల్లీలో సంతోషం కనిపిస్తోంది. హర్యానా ఎన్నికల ప్రచారంలో కేజ్రీవాల్ పార్టీకి నాయకత్వం వహిస్తారని చెప్పారు.
- సర్వోన్నత న్యాయస్థానం ఉత్తర్వులు బీజేపీకి చెంపపెట్టని ఆప్ హర్యానా శాఖ అధ్యక్షుడు సుశీల్ గుప్తా వ్యాఖ్యానించారు. కాషాయ పాలకులు అరవింద్ కేజ్రీవాల్‌ను తప్పుడు కేసులో జైల్లో నిర్బంధించినందుకు సిగ్గుపడాలని వ్యాఖ్యానించారు.
- కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు... రాజకీయ కక్షల కోసం రాజ్యాంగ సంస్థలను దుర్వినియోగం చేస్తున్న బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వానికి గట్టి ఎదురుదెబ్బ అని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. ఈ తీర్పు న్యాయం కోసం పోరాడుతున్న వారందరికీ ఊరటనిచ్చిందన్నారు. విద్వేష రాజకీయాలకు దిగిన బీజేపీ ఈ తీర్పు నుండి గుణపాఠం నేర్చుకోవాలన్నారు.
- అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడం రాజ్యాంగ విజయం అని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ పేర్కొన్నారు.

కేజ్రీవాల్‌ను జనాదరణ పొందిన, ప్రజా సంక్షేమా నికి అనుకూలమైన సీఎంగా అభివర్ణించారు. బీజేపీ రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తూ... అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందన్నారు.



ఈడీ సమన్ల నుంచి బెయిల్ వరకు...

న్యూదిల్లీ: దిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్వల్ భుయాన్‌తో కూడిన ధర్మాసనం శుక్రవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. బెయిల్‌పై విడుదలకుగాను రూ.10 లక్షల పూచికత్తు సమర్పించడంతోపాటు ఇద్దరు ష్యూరిటీ సంతకాలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. దిల్లీ మద్యం కుంభకోణం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసుతో దిల్లీతోపాటు తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ నేతలకు సైతం సంబంధాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆ యా రాష్ట్రాల నేతలను ఈడీ, సీబీఐ అరెస్ట్ చేసింది. దిల్లీ మద్యం కుంభకోణం కేసులో కేజ్రీవాల్ అరెస్టు నుంచి బెయిల్ వరకు జరిగిన పరిణామాలను పరిశీలిస్తే...

- అక్టోబర్ 2023: మద్యం కుంభకోణం కేసులో అరవింద్ కేజ్రీవాల్‌కు తొలిసారి సమన్లు జారీ చేసిన ఈడీ.
- నవంబర్ 2, 2023: ఈడీ సమన్లను పక్కన పెట్టి మధ్యప్రదేశ్‌లోని సింగ్రౌలిలో ర్యాలీలో పాల్గొన్న సీఎం కేజ్రీవాల్.
- డిసెంబర్ 2023: సీఎం కేజ్రీవాల్‌కు ఈడీ రెండోసారి సమన్లు జారీ చేసింది. ఇది రాజకీయ ప్రేరేపితం, అక్రమమంటూ దానిని సైతం పక్కన పెట్టారు.
- జనవరి 2024: ఈ కుంభకోణంలో ఈడీ ముచ్చటగా మూడోసారి కేజ్రీవాల్‌కు సమన్లు జారీ చేసింది. కేంద్రం కుట్రపూరితంగా వ్యవహరిస్తుందంటూ ఆ సమన్లను సైతం పట్టించుకోలేదు.
- జనవరి 18, 2024: దిల్లీ మద్యం కుంభకోణంలో ప్రశ్నించేందుకు తమ ఎదుట హాజరుకావాలంటూ ఈడీ వరుసగా నాలుగోసారి కేజ్రీవాల్‌కు సమన్లు జారీ చేసింది.
- ఫిబ్రవరి 02, 2024: ఐదవ సారి, ఆరవసారి జారీ చేసిన ఈడీ సమన్లను కేజ్రీవాల్ విస్మరించారు. ఈ సమన్ల వ్యవహారంలో చట్టబద్ధతపై కేజ్రీవాల్... తన న్యాయవాద బృందంతో సంప్రదింపులు జరిపారు.
- మార్చి 21, 2024: ఈడీ సమన్లు జారీ చేయడంపై బలవంతపు చర్యల నుంచి రక్షణ కోసం దిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన కేజీవాల్. అందుకు నిరాకరించిన దిల్లీ హైకోర్టు.
- మార్చి 21, 2024: ఇదే అంశంపై సీఎం కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.
- మార్చి 21, 2024: తాము జారీ చేసిన తొమ్మిది సమన్లకు కేజ్రీవాల్ స్పందించలేదని... కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేసింది.
- మే 10, 2024: లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారానికి అనుమతి ఇస్తూ సుప్రీంకోర్టు కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. జూన్ 1వ తేదీ తిరిగి తీహార్ జైల్లో లొంగిపోవాలని స్పష్టం చేసిన సుప్రీంకోర్టు.
- జూన్1, 2024: మధ్యంతర బెయిల్ కోసం దిల్లీ కోర్టును ఆశ్రయించిన కేజ్రీవాల్
- జూన్ 02, 2024: సుప్రీంకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో తీహార్ జైల్లో లొంగిపోయిన కేజ్రీవాల్
- జూన్ 05, 2024: కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించిన దిల్లీ కోర్టు
- జూన్ 20, 2024: మద్యం కుంభకోణం కేసులో మనీ లాండరింగ్ వ్యవహారంలో కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేసిన దిల్లీ కోర్టు.
- జూన్ 21, 2024: కేజ్రీవాల్‌ను బెయిల్‌పై జైలు నుంచి విడుదల ఉత్తర్వులను నిలిపి వేయాలంటూ దిల్లీ హైకోర్టును ఆశ్రయించిన ఈడీ.
- జూన్ 26, 2024: కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసిన సీబీఐ.
- సెప్టెంబర్ 05, 2024: కేజ్రీవాల్ అరెస్టును సవాల్ చేస్తూ... మద్యం కుంభకోణం కేసులో తనకు బెయిల్ ఇప్పించాలంటూ కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ.. తీర్పు రిజర్వ్ చేసిన సుప్రీంకోర్టు.
- సెప్టెంబర్ 13, 2024: కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేస్తూ తీర్పు వెలువరించిన సుప్రీంకోర్టు

రైలులో బాలికపై లైంగికదాడి

కాన్పూర్: కదులుతోన్న రైలులో ఘోరం చోటుచేసుకుంది. 11 ఏళ్ల బాలికపై ఓ వ్యక్తి (34) లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో అతడిని తోటి ప్రయాణికులు చితకబాదారు. దీంతో అతడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ రైలులో లక్నో- కాన్పూర్ మధ్య మంగళవారం రాత్రి జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. మృతుడిని బీహార్‌కు చెందిన రైల్వే కాంట్రాక్టు కార్మికుడు ప్రశాంత్ కుమార్‌గా గుర్తించారు. రైల్వే అదనపు డీజీ ప్రకాశ్ వెల్లడించిన వివరాల ప్రకారం నిందితుడు బీహార్‌లోని సివాన్‌లో బాధితురాలి కుటుంబంతో పాటు రైలు ఎక్కాడు. బాలికకు బెర్త్ ఆఫర్ చేసి... ఆమె తల్లి లేని సమయంలో లైంగికంగా వేధించాడు. ఈ విషయాన్ని బాలిక తన తల్లికి చెప్పగా... ఆమె కుటుంబ సభ్యులకు, ఇతర ప్రయాణికులకు సమాచారం ఇవ్వడంతో వారంతా తీవ్ర ఆగ్రహంతో నిందితుడిని చితకబాదారు. అనంతరం అతడిని కాన్పూర్ సెంట్రల్ స్టేషన్‌లో జీఆర్‌పీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే, అతడి ఆరోగ్యం విషమంగా ఉండటంతో పోలీసులు ఆస్పత్రికి తీసుకెళ్లగా... అప్పటికే మృతి చెందాడు. బాధిత బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఫ్‌ఐఆర్ నమోదు చేశామని, కేసు తదుపరి దర్యాప్తు కోసం లక్నోలోని జీఆర్‌పీ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు ఏడీజీ తెలిపారు. నిందితుడి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన తర్వాత అంత్యక్రియల కోసం కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు.

భయంతోనే రాహుల్ పర్యటనపై దుష్ప్రచారం

బీజేపీపై అశోక్ గెహ్లాత్ మండిపాటు

జైపూర్: కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అమెరికా పర్యటన విజయవంతం కావడంతో బీజేపీకి భయం పట్టుకుందని, అందుకే ఆయన పర్యటనపై దుష్ప్రచారం చేస్తోందని రాజస్థాన్ మాజీ సీఎం అశోక్ గెహ్లాత్ అన్నారు. బీజేపీ గత 15-20 ఏళ్లుగా రాహుల్ ప్రతిష్టను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నా... దేశ ప్రజలు ఇప్పుడు ఆయన కోసం ఆశతో ఎదురుచూస్తున్నారన్నారు. అందుకే కొందరు బీజేపీ నేతలు బరితెగించి రాహుల్ గాంధీని అంతమొందిస్తామంటూ బహిరంగంగానే మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఇలాంటి వ్యాఖ్యలపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా మౌనం వహించడం ఆశ్చర్యం కలిగిస్తోందని, అధికారం నిలబెట్టుకొనేందుకు ఎంతవరకైనా వెళ్తామనే ఆ పార్టీ ధోరణికి ఇది అద్దం పడుతోందని విమర్శించారు. రాహుల్... ఇలాంటివి మానుకో. లేదంటే మీ నాన్నమ్మకు పట్టిన గతే రాబోయే కాలంలో మీకూ పడుతుందని బీజేపీ నేత తర్విందర్ సింగ్ చేసిన వ్యాఖ్యలను గెహ్లాత్ ప్రస్తావించారు. ఈ తీవ్ర వ్యాఖ్యల వీడియోను కాంగ్రెస్ మీడియా, పబ్లిసిటీ విభాగం అధ్యక్షుడు పవన్ ఖేడా షేర్ చేశారు. అమెరికాలో నాలుగు రోజుల రాహుల్ పర్యటన గురించి గెహ్లాత్ మాట్లాడుతూ బీజేపీపూర్తిగా భయాందోళనకు గురవుతోంది. అందుకే ఈ పర్యటనపై తప్పుడు ప్రచారం వ్యాప్తి చేయడం మొదలు పెట్టింది. రాజ్యాంగాన్ని మార్చడం, రిజర్వేషన్లు తొలగించాలన్న ఉద్దేశంతో లోక్‌సభ ఎన్నికలకు వెళ్లిన బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారు. ఇంత జరిగినా బీజేపీ రిజర్వేషన్ల అంశంపై అవాస్తవాలు చెప్పడం మానుకోవట్లేదని అన్నారు. సమాజంలో సమానత్వం తీసుకొచ్చేందుకు రిజర్వేషన్లు అవసరమని రాహుల్ అన్నారని, అవసరాన్ని బట్టి దాని పరిమితిని ఇంకా పెంచాలని కూడా స్పష్టంగా చెప్పారన్నారు. సామాజిక న్యాయం కోసం రాహుల్ పోరాడుతున్నారని, రిజర్వేషన్లను తారుమారు చేయాలనే బీజేపీ లక్ష్యాన్ని ఎప్పటికీ నెరవేర్చనివ్వరన్నారు.

అహంకారపూరిత ప్రభుత్వం

చిన్న వ్యాపారులను అవమానించింది: రాహుల్



న్యూదిల్లీ : వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) పై ఆందోళన వ్యక్తం చేసినందుకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు రెస్టారెంట్ చైన్ యజమాని 'క్షమాపణ' చెబుతున్న వీడియోపై లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ శుక్రవారం ప్రభుత్వాన్ని నిందించారు. కేంద్రంలో పాలన చేస్తున్నది అహంకారపూరిత ప్రభుత్వమని ధ్వజమెత్తారు. రెండు వీడియోలను అనేక మంది కాంగ్రెస్ నాయకులు పంచుకున్నారు. వాటిలో ఒకటి సెప్టెంబరు 11న జరిగిన ఒక కార్యక్రమంలో అన్నపూర్ణ చైన్ ఆఫ్ రెస్టారెంట్స్ యజమాని శ్రీనివాసన్ వివిధ జీఎస్‌టీ రేట్లపై ఆందోళన వ్యక్తం చేస్తూ కనిపించారు. రెండవ వీడియోలో శ్రీనివాసన్ ఆర్థిక మంత్రికి వ్యక్తిగతంగా క్షమాపణలు చెప్పినట్లు కనిపించింది. ఈ 'అహంకారపూరిత ప్రభుత్వం' ప్రజలు చెప్పేది వింటుంటే, సరళీకృత జీఎస్‌టీ లక్షల వ్యాపారాల సమస్యలను పరిష్కరిస్తుందని వారు అర్థం చేసుకుంటారని గాంధీ అన్నారు. కోయంబత్తూర్‌లోని అన్నపూర్ణ రెస్టారెంట్ వంటి చిన్న వ్యాపార యజమాని, సరళీకృత జీఎస్‌టీ పాలన కోసం ప్రభుత్వ ఉద్యోగులను కోరినప్పుడు అతని అభ్యర్థన 'అహంకారం, పూర్తి అగౌరవం'తో తీర్చబడింది' అని 'ఎక్స్' లో ఒక పోస్ట్‌లో గాంధీ చెప్పారు. 'అయినప్పటికీ, ఒక బిలియనీర్ స్నేహితుడు నిబంధనలను వక్రీకరించడానికి, చట్టాలను మార్చడానికి లేదా జాతీయ ఆస్తులను సంపాదించడానికి ప్రయత్నించినప్పుడు మోదీ జీ రెడ్ కార్పెట్ పరుస్తాడు' అని రాహుల్ విమర్శించారు. 'మా చిన్న వ్యాపార యజమానులు ఇప్పటికే నోట్ల రద్దు దెబ్బలు, అందుబాటులో లేని బ్యాంకింగ్ వ్యవస్థ, పన్ను దోపిడీ, వినాశకరమైన జీఎస్‌టీని భరించారు. చివరికి వారికి దక్కింది అవమానమే. కానీ అధికారంలో ఉన్నవారి పెళుసుగా ఉండే అహం దెబ్బతింటుంటే, అవమానమే వారు అందజేస్తారని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు తెలిపారు. ఎంఎస్ఎంఈలు ఏళ్ల తరబడి ఉపశమనం కోసం అడుగుతున్నాయన్నారు.

నిర్మలమ్మ తీరు అవమానకరం: ఖడ్గే

న్యూదిల్లీ: ఆహార పదార్థాలపై జీఎస్టీ విషయంలో తమిళనాడుకు చెందిన 'శ్రీ అన్నపూర్ణ రెస్టారెంట్' యజమాని శ్రీనివాసన్ ఇటీవల ఆందోళన వ్యక్తం చేశారు. పెరుగుతున్న జీఎస్టీ గురించి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను ప్రశ్నించారు. రెస్టారెంట్లు ఎదుర్కొంటున్న సవాళ్లను తెలియజేశారు. అనంతరం ఓ ప్రైవేటు కార్యక్రమంలో ఆయన ఆర్థిక మంత్రిని కలిసి క్షమాపణలు చెప్పిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు చేసింది. ఆ వ్యక్తిపై కేంద్ర ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడిందని, ఇందుకుగాను సీతారామన్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది. ఈ ఘటనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే స్పందించారు. 'అన్నపూర్ణ రెస్టారెంట్ యజమాని వ్యవహారంలో నిర్మలా సీతారామన్ తీరు అవమానకరమైనది. పేద మధ్యతరగతి వర్గాల పట్ల జీఎస్టీ పన్ను భూతంలా మారింది. మోదీ ప్రభుత్వ చర్యలతో చిన్న వ్యాపారాల యజమానులు ఆర్థిక దాడులకు గురవుతున్నారు. అధికార అహంకారంతో వారీ విధంగా ప్రవర్తిస్తున్నారు' అని ఖడ్గే మండిపడ్డారు. వస్తువులపై సరళమైన, ఏకరీతి, హేతుబద్ధమైన జీఎస్టీ అవసరమని కాంగ్రెస్ ముందు నుంచి చెబుతోందన్నారు.

అవన్నీ తప్పుడు ఆరోపణలు

సెబీ చైర్‌పర్సన్ మాధవి వివరణ

ముంబై: తనపై వచ్చిన ఆరోపణలపై సెబీ చైర్‌పర్సన్ మాధవీ పురీ బచ్ తొలిసారి నోరువిప్పారు. సెబీ చైర్‌పర్సన్‌గా ఉంటూ పరస్పర విరుద్ధ ప్రయోజనాలు పొందారంటూ తనపై వచ్చిన ఆరోపణలను ఆమె తోసిపుచ్చారు. ఆ ఆరోపణలు తప్పని, దురుద్దేశాలతో కూడినవని పేర్కొన్నారు. సెబీ నిబంధనలు, మార్గదర్శకాలకు కట్టుబడి ఉన్నానని చెప్పుకొచ్చారు. ఈ మేరకు తన భర్త ధావల్ బచ్‌తో కలిసి ఆమె శుక్రవారం ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. అదానీ గ్రూప్ కంపెనీలపై ఉద్దేశపూర్వకంగానే ఆమె నెమ్మదిగా దర్యాప్తు చేస్తున్నారని, ఇందుకు కారణం బచ్ గతంలో ఆ గ్రూప్‌లో పెట్టిన పెట్టుబడులు, ఒప్పందాలే కారణమని హిండెన్‌బర్గ్ ఆరోపించిన విషయం తెలిసిందే. ఆపై కాంగ్రెస్ కూడా ఆమెపై విమర్శలు ఎక్కుపెట్టింది. ఐసీఐసీఐ బ్యాంక్ నుంచి వేతనం అందుకుంటున్నారని, మాధవి దర్యాప్తు చేస్తున్న కంపెనీల నుంచి ఆమె భర్త ధావల్ బచ్‌కు చెందిన కన్సల్టెన్సీ సంస్థ ఆదాయాలు ఆర్జిస్తోందని ఆరోపణలు చేసింది. మహీంద్రా గ్రూప్ నుంచి ధావల్ బచ్ రూ.4.78 కోట్లు పొందారని కాంగ్రెస్ ఆరోపించగా... సెబీ చైర్‌పర్సన్‌గా మాధవి నియామకానికి మూడేళ్ల ముందే ధావల్ తమ గ్రూప్‌లో చేరారని మహీంద్రా పేర్కొన్నది. డాక్టర్ రెడ్డీస్ కూడా తాము ధావల్ సేవలకు రూ.6.58 లక్షలు చెల్లించామని, అది మాధవి సెబీ చైర్‌పర్సన్ కాకముందేనని వివరించింది. తాము సెబీ నిబంధనలు/ఆదేశాల కిందకు ఎపుడూ రాలేదని పిడిలైట్ పేర్కొంది. ఈ ఆరోపణలపై ఇంకా బచ్ స్పందించలేదంటూ హిండెన్‌బర్గ్ ఆరోపించిన వేళ... ఈ ప్రకటన విడుదల చేశారు. తమపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి అంశాల వారీగా వివరణ ఇచ్చారు. తమ ఆదాయపు పన్ను రిటర్నుల ఆధారంగా తమపై ఈ ఆరోపణలు చేశారని, వాటిని అక్రమ మార్గంలో సంపాదించడం వ్యక్తిగత గోప్యత ఉల్లంఘనతో పాటు, ఐటీ చట్టం ఉల్లంఘనే అవుతుందని పేర్కొన్నారు. మహీంద్రా, ఐసీఐసీఐ బ్యాంక్, డాక్టర్ రెడ్డీస్, పిడిలైట్ వంటి కంపెనీలు ధావల్ బచ్ సేవలు వినియోగించుకున్నందుకుగాను ఆయనకు చెందిన అగోరా ఇండియా, అగోరా పార్ట్‌నర్స్‌కు చెల్లింపులు చేశాయని ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్నారు. తన జీవిత భాగస్వామి ప్రభుత్వంలో ఉన్నతాధికారిగా ఉన్నంత మాత్రన ఆయన సలహాలు వినియోగించుకుంటే... వారి వృత్తి నైపుణ్యాలను, సామర్థ్యాలను విస్మరించి తప్పులు ఆపాదించడం బాధాకరమని పేర్కొన్నారు. ధావల్ బచ్.. ఐఐటీ దిల్లీ నుంచి ఇంజినీర్ అని, 35 ఏళ్ల అనుభవం ఆయన సొంతమని గుర్తు చేశారు. హిందుస్థాన్ యూనిలీవర్ బోర్డులో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హోదాలో పనిచేశారని పేర్కొన్నారు. ఐసీఐసీఐ బ్యాంక్ నుంచి ఎంప్లాయీ స్టాక్ ఆప్షన్లు పొందడం గురించి వచ్చిన ఆరోపణలపైనా బచ్ వివరణ ఇచ్చారు. సాధారణంగా ఐసీఐసీఐ బ్యాంక్‌కు రాజీనామా చేసిన ఉద్యోగులు తమకు కేటాయించిన స్టాక్ ఆప్షన్లను మూడు నెలల్లో వినియోగించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అదే రిటైర్ అయిన ఉద్యోగులకు పదేళ్ల పాటు ఆ వెసులుబాటు ఉంటుందన్నారు. తన విషయంలో ఇదే జరిగిందని పేర్కొన్నారు. తనకొచ్చే పెన్షన్ మొత్తంపైనా లేనిపోని ఆరోపణలు చేశారని, తనకు ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ నుంచి యాన్యుటీ ఉందని వివరణ ఇచ్చారు.

హర్యానా బరిలో రూ.2.4 లక్షల కోట్ల సంపన్నురాలు

చండీగఢ్: ఎన్నికల్లో సంపన్నులు పోటీ చేయడం సాధారణమే. అయితే హర్యానా ఎన్నికల్లో రికార్డు స్థాయి ఆస్తి ఉన్న ఒక మహిళ స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగారు. ఆమె బీజేపీ కురుక్షేత్ర ఎంపీ నవీన్ జిందాల్ తల్లి సావిత్రి జిందాల్. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ టికెట్‌పై పోటీ చేయాలని ఆమె ఆశించారు. అయితే కాషాయ పార్టీ జాబితాలో ఆమె పేరు లేకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా రంగంలోకి దిగారు. హిస్సార్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్‌కు చివరి రోజు అయిన గురువారం ఆమె నామినేషన్ పత్రాలు సమర్పించారు. భారత ప్రముఖ పారిశ్రామివేత్త, దివంగత ఓపీ జిందాల్ సతీమణి అయిన సావిత్రి జిందాల్... హిస్సార్ బీజేపీ సిట్టింగ్ ఎమ్మెల్యే కమల్ గుప్తాపై పోటీకి దిగారు. ఆయనతోనే ఆమెకు ప్రధాన పోటీ ఉండే అవకాశం ఉందని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. నామినేషన్ దాఖలు చేసిన అనంతరం సావిత్రి మాట్లాడుతూ హిస్సార్ నియోజకవర్గ అభివృద్ధి, మార్పు కోసం తాను సేవ చేస్తానని అన్నారు. 'హిస్సార్ ప్రజలు నా కుటుంబ సభ్యులు. నా భర్త, దివంగత ఓం ప్రకాశ్ జిందాల్ మీతో నా బంధాన్ని ఏర్పరచారు. జిందాల్ కుటుంబం ఎల్లప్పుడూ హిస్సార్‌కు సేవ చేస్తూనే ఉంది. చేస్తూనే ఉంటుంది. ప్రజల అంచనాలకు అనుగుణంగా, వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి నేను సంపూర్ణ అంకితభావంతో ఉంటాను' అని సావిత్రి జిందాల్ హామీ ఇచ్చారు. 'హిస్సార్ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి బీజేపీ కమల్ గుప్తాను బరిలోకి దింపింది. సొంత పార్టీ అభ్యర్థిపై పోటీ చేయడం తిరుగుబాటు కాదా' అని విలేకరులు ప్రశ్నించగా సావిత్రి జిందాల్ ఆసక్తికరమైన సమాధానం ఇచ్చారు. 'అలా పరిగణించకూడదు. నా కొడుకు నవీన్ జిందాల్ తరపున లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం మాత్రమే చేశాను. నేను పార్టీ సభ్యత్వం తీసుకోలేదు' అని ఆమె వివరణ ఇచ్చారు. కాగా హిస్సార్ అసెంబ్లీ స్థానం నుంచి సావిత్రి జిందాల్ పోటీ చేయడం ఇదే తొలిసారి కాదు. గతంలో ఇక్కడి నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2005లో తొలిసారిగా కాంగ్రెస్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. వరుసగా రెండోసారి 2009లో కూడా ఈ సీటును ఆమె కైవసం చేసుకున్నారు. 2013లో మాజీ సీఎం భూపిందర్ సింగ్ హుడా ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. అయితే ఈ ఏడాది మార్చిలోనే కొడుకు నవీన్ జిందాల్ కాంగ్రెస్ పార్టీని వీడి బీజేపీలో చేరారు. దీంతో ఆయన బాటలోనే సావిత్రి జిందాల్ కాంగ్రెస్‌ను వీడారు. కాగా ఫోర్బ్స్ ఇండియా నివేదిక ప్రకారం ఈ ఏడాది సావిత్రి జిందాల్ నికర సంపద 29.1 బిలియన్ డాలర్లుగా ఉంది. అంటే భారతీయ కరెన్సీలో సుమారు రూ.2.4 లక్షల కోట్లతో సమానం. దేశంలోనే అత్యంత సంపన్న మహిళ సావిత్రి జిందాల్ అని ఫోర్బ్స్ ఇండియా పేర్కొంది. కాగా హర్యానాలోని 90 అసెంబ్లీ స్థానాలకు అక్టోబర్ 5న పోలింగ్ జరగనుంది. 8న ఫలితాలు వెలువడనున్నాయి.

జోక్యం చేసుకోండి

రాష్ట్రపతి, ప్రధానికి జూనియర్ వైద్యుల లేఖ

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లో ఆందోళన చేస్తున్న జూనియర్ వైద్యులు ఆర్‌జీ కర్ ఆస్పత్రి ప్రతిష్ఠంభనలో జోక్యం చేసుకోవాలని అభ్యర్థిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. జూనియర్ వైద్యుల సంఘం రాసిన నాలుగు పేజీల లేఖ ప్రతులను ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్, కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డాకు కూడా పంపారు. ఆగస్టు 9న ప్రభుత్వ ఆధీనంలోని ఆర్‌జీ కర్ వైద్య కళాశాల ఆస్పత్రిలో జూనియర్ వైద్యురాలు హత్యాచారానికి గురైంది. అప్పటి నుంచి జూనియర్ వైద్యులు విధులను బహిష్కరించి, ఆందోళన కొనసాగిస్తున్నారు. 'అత్యంత దారుణ అఘాయిత్యానికి గురైన మా సహోద్యోగికి న్యాయం జరిగేలా దేశాధినేతగా మీ గౌరవనీయులైన మహోన్నత వ్యక్తి ముందు మేము వినయంగా సమస్యలను ఉంచుతున్నాం. తద్వారా పశ్చిమ బెంగాల్ ఆరోగ్య శాఖ అధ్వర్యంలోని ఆరోగ్య సంరక్షణ నిపుణులైన మేము భయం లేకుండా ప్రజలకు మా విధులను నిర్వర్తించవచ్చు' అని పేర్కొన్నారు. 'ఈ కష్ట సమయాల్లో మీ జోక్యం మనందరికీ వెలుగునిస్తుంది. మన చుట్టూ ఉన్న చీకటి నుంచి బయటపడే మార్గాన్ని చూపుతుంది' అని తెలిపారు. ఆందోళన చేస్తున్న వైద్యుల్లో ఒకరైన అనికేత్ మహతో పీటీఐతో మాట్లాడుతూ ఈ నెల ప్రారంభంలో లేఖను రూపొందించి గురువారం రాత్రి పంపామన్నారు.

రాయ్ నార్కో టెస్ట్‌కు కోర్టు తిరస్కృతి

కోల్‌కతా: 'ఆర్జీ కర్' కేసులో ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్‌కు నార్కో పరీక్ష నిర్వహించేందుకు సీబీఐ అనుమతి కోరగా కోల్‌కతా కోర్టు తిరస్కరించింది. నార్కో పరీక్షకు రాయ్ అంగీకరించలేదు. 31ఏళ్ల వైద్యురాలిపై అత్యాచారం, హత్య కేసులో అరెస్టుకు గురైన రాయ్‌ను శుక్రవారం సీల్దా కోర్టులో ప్రవేశపెట్టగా జనాంతిక విచారణ జరిగింది. నార్కో టెస్ట్ చేయించుకోవడానికి అభ్యంతరం ఉందా అని న్యాయమూర్తి ప్రశ్నించగా రాయ్ ఉందన్నారు. పరీక్ష చేయించుకునేందుకు నిరాకరించారు. దీంతో సీబీఐకి అనుమతి ఇచ్చేందుకు కోర్టు అంగీకరించలేదు. 2010లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సంబంధిత వ్యక్తి అంగీకారంతోనే నార్కో పరీక్ష చేయాలి. ఈ పరీక్ష చట్టబద్ధమైనప్పటికీ పరిస్థితులను బట్టి కోర్టులు పరిమిత అనుమతులు ఇస్తుంటాయి. రాయ్ చెప్పేది నిజమో కాదో తేలాలంటే నార్కో పరీక్షతోనే సాధ్యమని కోర్టుకు సీబీఐ తెలిపింది. నార్కో పరీక్ష కోసం వ్యక్తి శరీరంలోకి సోడియం పెంటోథల్ పంపి హిప్నోటైజ్ చేస్తారని, అతను అబద్ధం చెప్పేందుకు ఆస్కారం ఉండదని విలేకరులతో మాట్లాడిన సీబీఐ అధికారి ఒకరు తెలిపారు.

టైట్లర్‌పై అభియోగాల నమోదు



న్యూదిల్లీ: సిక్కు అల్లర్ల కేసులో కాంగ్రెస్ నేత జగదీశ్ టైట్లర్‌పై దిల్లీ కోర్టులో శుక్రవారం అభియోగాలు నమోదయ్యాయి. హత్య సహా వివిధ నేరాభియోగాలు నమోదు కాగా తాను నిర్దోషిని అని టైట్లర్ చెప్పుకున్నారు. అయితే ఆయనపై విచారణకు ఆదేశాలిస్తూ ప్రత్యేక న్యాయమూర్తి రాకేశ్ సియాల్ ఉత్తర్వులు జారీచేశారు. నిందితుడిపై చర్యలు తీసుకునేందుకు కావాల్సిన సాక్ష్యాధారాలు ఉన్నాయని ఆగస్టు 30న జరిగిన విచారణప్పుడు జడ్జి తెలిపారు. తాను ఏ తప్పు చేయలేదని, గురుద్వారా వద్ద జరిగిన మూడు హత్యలు, అల్లర్లతో తనకు సంబంధం లేదని టైట్లర్ కోర్టుకు చెప్పారు. ' కేసు విచారణ ప్రారంభం కావడానికి 40 ఏళ్లు పట్టింది. ఇది దురదృష్టకరం. ఒక శక్తిమంతమైన వ్యక్తి వ్యవస్థ మొత్తాన్ని ఎలా నిర్వీర్యం చేయగలరు అనేందుకు ఇదే నిదర్శనం. త్వరలో విచారణ ముగిసి నిందితులకు జైలుశిక్ష పడుతుంది' అని న్యాయవాది హర్విందర్ సింగ్ ఫూల్కా విలేకరులతో పేర్కొన్నారు. 1984 నాటి సిక్కు అల్లర్ల కేసులో తదుపరి విచారణను కోర్టు అక్టోబరు 3వ తేదీకి వాయిదా వేసింది. ఇందిరాగాంధీ హత్యానంతరం సిక్కులకు వ్యతిరేకంగా అల్లర్లు చెలరేగాయి. అల్లరిమూకలను రెచ్చగొట్టినట్లు టైట్లర్‌పై ఆరోపణలు ఉన్నాయి. సీబీఐ తన ఛార్జిషీటులో ఇదే పేర్కొంది. అల్లర్ల సమయంలో టైట్లర్ గురుద్వారా సమీపంలోని అల్లరిమూకలను రెచ్చగొట్టారని, దీంతో వారు గురుద్వారాకు నిప్పు పెట్టడంతో పాటు ముగ్గురు సిక్కులను హత్య చేసినట్లు ఛార్జిషీటులో సీబీఐ వెల్లడించింది. ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలంలోనూ ఇదే ఉండటంతో ఆయనపై అభియోగాలు నమోదుకు తగిన ఆధారాలు ఉన్నాయని కోర్టు భావించింది.

వరద బాధితులకు సీపీఐ సాయం

రూ.5 లక్షల విలువైన సామగ్రి పంపిణీ

సర్వం కోల్పోయిన వారిని ఆదుకోవాలి : రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : సీపీఐ అధ్వర్యంలో విజయవాడ నగర వరద బాధితులకు దాదాపు రూ.5 లక్షల విలువ చేసే బియ్యం, నూనె, దుప్పట్లు, టవళ్లు తదితర సామాన్లను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పంపిణీ చేశారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీపీఐ ప్రకాశం జిల్లా సమితి వసూలు చేసిన సామాగ్రిని శుక్రవారం విజయవాడ దాసరి భవన్ వద్ద పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, అక్కినేని వనజ వరద బాధితులకు పంపిణీ చేశారు. రామకృష్ణ మాట్లాడుతూ బుడమేరు వరద కారణంగా విజయవాడ నగరం అతలాకుతలమైందని, ప్రజల ఆస్తులు పూర్తిగా వరదలో కొట్టుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు కట్టుబట్టలతో మిగిలారన్నారని చెప్పారు. తినటానికి తిండి లేక, తాగటానికి నీరు లేక, కట్టుకోవడానికి బట్టలు లేక, ప్రజలు బురద నీటిలో దోమలతో సహజీవనం చేయలేక అల్లాడుతున్నారన్నారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం, దాతలు స్పందించి సాయమందించేందుకు ముందుకు వచ్చినప్పటికీ, అవి పూర్తిస్థాయిలో అందలేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వరద సాయం తక్షణమే అందించకుండా, కేవలం లెక్కలకే పరిమితమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సర్వం కోల్పోయిన వరద బాధితులకు అధిక మొత్తంలో నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వరద బాధితులకు సాయం అందించడంలో సీపీఐ ముందంజలో ఉందన్నారు. వరద బాధితులను ఆదుకున్న సీపీఐ ప్రకాశం జిల్లా సమితికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిహెచ్ కోటేశ్వరరావు, ప్రకాశం, ఎన్టీఆర్ జిల్లాల కార్యదర్శులు ఎం.ఎల్.నారాయణ, దోనేపూడి శంకర్, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ప్రకాశం జిల్లా నాయకులు పీవీఆర్ చౌదరి, వై.రవీంద్రబాబు, కె.వీరారెడ్డి, సయ్యద్ యాసిన్, కొత్తకోట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.20 వేల పరిహారం

- రామకృష్ణ డిమాండ్
- వరద బాధితులకు సాయం... మోదుమూడి కుటుంబానికి అభినందన

విశాలాంధ్ర-అవనిగడ్డ: వరదల్లో పూర్తిగా నష్టపోయిన రైతులకు 20 వేల రూపాయల పరిహారం చెల్లించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ శుక్రవారం డిమాండ్ చేశారు. కృష్ణా జిల్లా అవనిగడ్డ మండల పరిధిలోని దక్షిణ చిరువోలు లంక గ్రామంలో మోదుమూడి కుటుంబ సభ్యుల అధ్వర్యంలో జరిగిన వరద బాధితులకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో రామకృష్ణ పాల్గొన్నారు. భారీ వర్షాలు, ఆకస్మిక వరదలతో అనేక ప్రాంతాల ప్రజల జీవితాలు అతలాకుతలమయ్యాయని, వారిని తిరిగి నిలబెట్టేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని రామకృష్ణ డిమాండు చేశారు. తొలుత రామచంద్రపురంలో రామకృష్ణ, ఇతర సీపీఐ నాయకులకు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి ప్రదర్శనగా దక్షిణ చిరువోలు లంకకు వెళ్లారు. దుప్పట్ల పంపిణీ అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ వరద నష్టాన్ని సాధారణ విపత్తుగా చూడకూడదన్నారు. వరద ప్రాంతాల్లో జనజీవనం అస్తవ్యస్తంగా ఉన్నదన్నారు. ఇళ్లల్లోని ఎలక్ట్రానిక్ పరికరాలు, వాహనాలు, పుస్తకాలు, నిత్యావసర వస్తువులు నీట మునిగి ప్రజలు సర్వం కోల్పోయారని, ఏళ్లతరబడి శ్రమించి కొనుక్కున్న వస్తువులన్నీ వరదపాలు కావడంతో బాధితులు కన్నీటి పర్యంతమవుతున్నారన్నారు. వారిని సత్వరం ఆదుకోవలసిన అవసరం ఉన్నదన్నారు. బాధితులకు భారీ సహాయ కార్యక్రమం చేపట్టిన మోదుమూడి కుటుంబాన్ని రామకృష్ణ అభినందించారు.

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకోవడానికి మోదుమూడి కుటుంబం ముందుకు రావటం అభినందనీయమన్నారు. సేవా కార్యక్రమాలలో మోదుమూడి కుటుంబం ఎప్పుడూ ముందుంటుందని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ వరదలు, భారీ వర్షాల వల్ల నష్టపోయిన రైతుల రుణాలు పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పంట పొలాలు, పట్టు గూళ్ల పెంపక కేంద్రాలు నీట మునిగాయన్నారు. రుణాల రద్దుతోనే రైతులు కోలుకోగలుగుతారన్నారు. మారుమూల గ్రామంలో బాధితులకు సహాయ పంపిణీ కార్యక్రమం చేపట్టిన మోదుమూడి కుటుంబ సభ్యులను అభినందించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు మాట్లాడుతూ వరదలు అపారనష్టం కలిగించాయన్నారు. పనులు లేక వ్యవసాయ కూలీలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రెసివ్ ఫోరం రాష్ట్ర నాయకులు అక్కినేని చంద్రరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి టి.తాతయ్య, మహిళా సమాఖ్య నాయకురాలు సీహెచ్ దుర్గ, సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు రామారావు, కోదాటి నారాయణరావు, లింగం ఫిలిప్, వై.ఈశ్వరరావు, ఎం.అరుణకుమారి, ఒడుగు రత్నకుమారి, ఒడుగు కృష్ణచైతన్య, కె.గగన్, నెలబాలుడు, ఎం.పద్మావతి, సర్పంచ్ సనక సుబ్రహ్మణ్యం, మోదుమూడి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గువహతి: అసోంలో అక్రమ నిర్మాణాలను ఖాళీ చేయించే ప్రక్రియ హింసాత్మకంగా మారింది. పోలీసుల కాల్పులలో నలుగురు చనిపోయారు. ఈ ఘటన గురువారం జరిగింది. మృతుల కుటుంబాలను సీపీఐ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ శుక్రవారం పరామర్శించారు. గువహతి సమీపంలోని సోన్‌పూర్‌లో ఖాళీ చేయిస్తున్న ప్రాంతాన్ని సందర్శించారు. నారాయణ వెంట నాయకులు మునీర్ మనంత, కనక్ గొగోయ్ తదితరులు ఉన్నారు.

విజయవాడ రైల్వేస్టేషన్‌కు ఎన్‌ఎస్‌జీ-1 హోదా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: దక్షిణ మధ్య రైల్వే పరిధిలో కీలకమైన విజయవాడ రైల్వేస్టేషన్‌కు అరుదైన గుర్తింపు లభించింది. ఈ స్టేషన్ ఎన్‌ఎస్‌జీ-1 హోదా దక్కించుకుంది. దేశంలో ఉన్న టాప్-28 రైల్వేస్టేషన్ల ఎలైట్ జాబితాలో పేరు సంపాదించుకుంది. దక్షిణ మధ్య రైల్వేపరిధిలో సికింద్రాబాద్ తర్వాత ఈ హోదా దక్కించుకున్న ఏకైక స్టేషన్ విజయవాడ కావడం గమనార్హం. ఎన్‌ఎస్‌జీ-1 హోదాను రూ.500 కోట్ల వార్షికాదాయం దాటిన రైల్వేస్టేషన్లకు... లేదంటే రెండు కోట్ల మంది ప్రయాణికులు ప్రయాణించే స్టేషన్‌కు ఇస్తారు. భారతీయ రైల్వే ఈ విధానాన్ని 2017-18 సంవత్సరంలో తీసుకువచ్చింది. గతంలో ఈ అవకాశానికి దగ్గరగా వచ్చి కోల్పోయిన విజయవాడ రైల్వేస్టేషన్... ఐదు సంవత్సరాల తర్వాత మళ్లీ తాజాగా ఎన్‌ఎస్‌జీ-1 స్టేషన్లపై సమీక్ష చేయగా రూ.528 కోట్ల ఆదాయంతో చోటు సంపాదించుకుంది. వాణిజ్యపరంగా, ప్రయాణికుల ద్వారా ఈ స్టేషన్‌కు అత్యధిక ఆదాయం వస్తుంది. మనదేశంలో అత్యధిక రద్దీ ఉండే స్టేషన్‌తోపాటు అతిపెద్ద రైల్వే జంక్షన్‌గా విజయవాడ స్టేషన్ పేరు తెచ్చుకుంది.

మంకీపాక్స్ టీకాకు డబ్ల్యూహెచ్ఓ అనుమతి

జెనీవా: ప్రాణాంతక మంకీపాక్స్‌కు చెక్ పెట్టేందుకుగాను టీకాకు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) అనుమతులు జారీచేసింది. ఈ వాక్సిన్ అత్యవసర వినియోగానికి అంగీకరించింది. ఆఫ్రికాతో పాటు వివిధ దేశాల్లో మంకీపాక్స్ వేగంగా విస్తరిస్తుండటంతో డబ్ల్యూహెచ్ఓ ఈ నిర్ణయం తీసుకుంది. బవేరియన్ నార్డిక్ సంస్థ అభివృద్ధి చేసిన ఎంపాక్స్ వాక్సిన్‌ను వాక్సిన్ అలయన్స్ గావీతోపాటు యూనిసెఫ్ వంటి సంస్థలు కొనుగోలు చేయొచ్చు. తయారీ సంస్థ ఒక్కటే కావడంతో పరిమిత సంఖ్యలోనే వీటి ఉత్పత్తి జరుగుతోంది. 18 ఏళ్లు పైబడిన వారికి ఈ వాక్సిన్ రెండు డోసుల్లో ఇవ్వాలి. మైనర్లకు టీకా ఇచ్చే అనుమతి లేనప్పటికీ వ్యాధి ముప్పు అధికంగా ఉన్న ప్రాంతాల్లోని చిన్నారులు, యుక్తవయసు వారికి వాక్సిన్ ఇవ్వవచ్చని డబ్ల్యూహెచ్ఓ పేర్కొంది.

రానున్న 24 గంటల్లో మరో అల్పపీడనం

న్యూఢిల్లీ/హైదరాబాద్: ఆగ్నేయ బంగ్లాదేశ్ పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతోనే కోస్తా బంగ్లాదేశ్, ఉత్తర బంగాళాఖాతం పరిసర ప్రాంతాలపై అల్పపీడనం ఏర్పడే అవకాశముంది. ఆ తరువాత 48 గంటల్లో పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ బలపడుతుంది. పశ్చిమ బెంగాల్, వాయువ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశముంది. దీని ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో మోస్తారు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి. ఈ మేరకు వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణములో వాయవ్య దిశగా గాలులు వీస్తున్నాయని తెలిపింది. తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశమున్నట్లు పేర్కొంది. బలమైన ఉపరితల గాలులు గంటకు 30-40 కిలోమీటర్ల వేగముతో వీచే అవకాశమున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది.

నైరుతి రుతుపవనాలు వెనక్కి

నైరుతి రుతుపవనాలు వెనక్కి మళ్లడం త్వరలో మొదలవుతుందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఈనెల 19 నుంచి 25 తేదీల మధ్య ఈ ప్రక్రియ జరుగుతుందని తెలిపింది. నైరుతి రుతుపవనాలు ఏటా సాధారణంగా జూన్ ఒకటో తేదీన తొలిసారిగా కేరళను తాకుతాయి. అక్కడి నుంచి విస్తరిస్తూ జులై ఎనిమిదో తేదీకల్లా దేశమంతా చుట్టేస్తాయి. 17వ తేదీన తిరోగమనం మొదలై అక్టోబర్ 15 కల్లా వెళ్లిపోతాయి. ఈ నైరుతి సీజన్‌లో దేశంలో సగటున 836.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

17న వరద సాయం

పరిహార జాబితా శాస్త్రీయం

అధికారులకు సీఎం ఆదేశం

వరద నష్టగణనపై సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వరద ముంపు సహాయ చర్యలపై ప్రజలు సంతృప్తితో ఉన్నారని, పరిహారం విషయంలో శాస్త్రీయంగా ఆలోచించి జాబితా రూపొందించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు, వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయిన ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని, ఈనెల 17న బాధితులకు సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రులు, అధికారులతో చంద్రబాబు సమీక్షించారు. ఇప్పటికే మొదలైన నష్టం వివరాల సేకరణపై ఆరా తీశారు. నష్టగణన పక్కాగా జరగాలని, నష్టపోయిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సాయం చేరాలన్నారు. నష్టగణన వివరాలను సీఎంకు అధికారులు వివరించారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఆర్థిక సాయంపై ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకోనుంది. ఇల్లు పూర్తిగా మునిగి ఆస్తినష్టం జరగడంతోపాటు మొదటి ఫ్లోర్‌లో ఉన్నవారికి సైతం సాయం ప్రకటించాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. వరద కారణంగా ఇంట్లో వస్తువులు అన్నీ పాడైపోయిన మొదటి అంతస్తువారికి ఒక మొత్తం, రెండో ఫ్లోర్ నుంచి ఆ పైన ఉన్నవాళ్లకి కొంత మొత్తం ఇవ్వాలన్న ప్రతిపాదనతో ఉంది. దెబ్బతిన్న ద్విచక్రవాహనాలకు కూడా పరిహారంపైనా పునరాలోచిస్తోంది. పూర్తిగా ఇల్లు దెబ్బతిన్న వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొత్త ఇల్లు నిర్మించి ఇవ్వనున్నారు. వరదల కారణంగా 2,13,456 ఇళ్లు నీటమునిగినట్లు ప్రభుత్వం అంచానా వేస్తోంది. ఇందులో ఇప్పటి వరకు 84,505 ఇళ్లలో నష్టం అంచనా లెక్కలు పూర్తయ్యాయి. వేలాది ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు, 2,14,698 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. వీటికి కూడా పరిహారం అందించనున్నారు. ఈ సమీక్షలో మంత్రులు వంగలపూడి అనిత, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, పి. నారాయణ, నాదెండ్ల మనోహర్ తో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులకు రూ.186 కోట్లు

భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు రూ.186 కోట్లు విడుదల చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. రహదారుల్లో ప్రధాన సమస్యగా ఉన్న పాత్ హోల్స్ పూడ్చేందుకు మరో రూ.290 కోట్లు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖపై సీఎం సమీక్ష చేశారు. టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి వర్షాలు తగ్గిన వెంటనే ఈ పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఆర్వోబీల పూర్తికి భూసేకరణ కోసం అవసరమైన రూ.42 కోట్ల నిధుల విడుదలకు కూడా అంగీకారం తెలిపారు. రాష్ట్రంలో రూ.65 వేల కోట్లతో జరుగుతున్న నేషనల్ హైవే పనులను వేగవంతం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ శాఖతో సమన్వయం చేసుకుంటూ పనులు వేగంగా పూర్తి అయ్యేలా చూడాలని, ప్రతి మూడు నెలలకు ఎంత పని పూర్తి చేయగలం అనేది మదింపు చేసుకుని టార్గెట్ పెట్టుకుని పనులు పూర్తి చేయాలని చెప్పారు. రోడ్ల పరిస్థితి, వివిధ ప్రాజెక్టుల స్థితిగతులపై రివ్యూ చేశారు. సచివాలయంలో జరిగిన ఈ సమీక్షలోమంత్రి బిసి జనార్ధన్ రెడ్డితో పాటు ఆ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఎడతెరపి లేకుండా కురిసిన భారీ వర్షాలు, వరదలతో రోడ్ నెట్ వర్క్ కు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల అసలే అంతంత మాత్రంగా ఉన్న రోడ్ల దుస్థితి మరింత దారుణంగా తయారయ్యాయని వివరించారు. వరదల కారణంగా దెబ్బతిన్న దాదాపు 4,565 కిలోమీటర్ల రోడ్లలో మరమ్మతు పనులు చేసేందుకు రూ.186 కోట్లు, వివిధ జిల్లాల్లో గుంతలు పూడ్చడం కోసం రూ.290 కోట్లు మంజూరు చేస్తున్నట్లు వివరించారు. డ్రోన్, లైడార్ సాంకేతిక సహాయంతో దెబ్బతిన్న రహదారుల నష్టాన్ని అంచనా వేసి పనుల చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారుల కాంట్రాక్టర్లు కొందరు సక్రమంగా పని చేయడం లేదని, పనితీరు మార్చుకోకపోతే నిబంధనల ప్రకారం చర్యలకు వెనుకాడవద్దని హెచ్చరించారు. అమరావతి ఔటర్ రింగ్ రోడ్, వైజాగ్ నుంచి మూలాపేట, విజయవాడ తూర్పు బై పాస్, విజయవాడ-హైదరాబాద్, హైదరాబాద్ - బెంగుళూరు హైవేల విస్తరణ, హైదరాబాద్ నుంచి అమరావతి వరకు కొత్త గ్రీన్ ఫీల్డ్ కారిడార్ కు సంబంధించి ప్రణాళికలు నేషనల్ హైవే అథారిటీ ద్వారా చేపట్టాలని సీఎం చెప్పారు.



Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.